ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
14-10-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 255 పేజీలు: 16 వెల: 6.50

## పాపికొండల విహారయాత్ర షురూ

### గండిపోచమ్మ తల్లి ఆలయం నుంచి 130 మందితో రెండు బోట్లలో పునః ప్రారంభం



**చింతూరు (పోలవరం జిల్లా), అక్టోబరు 13 ప్రభాతవార్త:** గోదావరి నదిలో పాపి కొండల విహారయాత్రకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వరదల కారణంగా సుమారు 75 రోజులుగా నిలిచిపో >>2



మంగళవారం తన నివాసానికి వచ్చిన తమిళనాడు సిఎం విజయ్‌కు సాదరంగా స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## గోదావరి - కావేరి అనుసంధానంపై

# కలిసి నడుద్దాం

### ఎపి-తమిళనాడు ముఖ్యమంత్రుల నిర్ణయం

- చంద్రబాబు నివాసంలో విజయ్ సమావేశం
- ఇరు రాష్ట్రాల మంత్రులు, అధికారులు హాజరు
- చెన్నై నగరానికి తాగునీళ్లు ఇవ్వాలని విజయ్ విజ్ఞప్తి
- ఇప్పటికే 4.08 టిఎంసిల నీటిని విడుదల చేశాం
- నీటి లభ్యత, అవసరాలను బట్టి ఆలోచిస్తాం: చంద్రబాబు

**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి - కావేరీ నదుల అనుసంధానం అంశంపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సమన్వయంతో ముందుకు సాగాలని రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు చంద్రబాబునాయుడు, విజయ్ జోసెఫ్‌లు నిర్ణయిం చారు. గోదావరి జలాలను కావేరీకి తరలించి దక్షిణాది రాష్ట్రాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో ఎపి సిఎం చంద్రబాబు, తమిళనాడు సిఎం విజయ్ కీలక చర్చలు జరిపారు. అమరావతి లోని నివాసంలో చంద్రబాబుతో విజయ్ భేటీ అయ్యారు. తెలుగు గంగ ద్వారా చెన్నైకు మరింతగా మంచి నీరు విడుదల చేయాలని సిఎం విజయ్ కోరారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జలాలు తగ్గడం, తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్న ప్పటికీ చెన్నై దాహార్తి తీర్చే విషయంలో ఎపి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే 4.08 టిఎంసిల నీటిని చెన్నై నగరానికి విడుదల చేసినట్టు సిఎం చంద్రబాబు చెప్పారు. నీటి లభ్యత, అవసరాలకు అనుగుణంగా మరికొంత నీటిని విడుదల చేయడంపైనా ఆలోచన చేస్తామని చెప్పారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నడుమ సుమారుగా గంటన్నరపాటు సాగిన ఈ సమావే శంలో గోదావరి - కావేరీ నదుల అనుసంధానం, చెన్నై మంచి నీటి అవసరాలకు తెలుగు గంగ ద్వారా నీటి సరఫరా వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. గోదావరి నుంచి కృష్ణాకు, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, బొల్లాపల్లి నుంచి బనకచర్ల మీదుగా పెన్నాకు, కండలేరు ద్వారా కావేరికి నీటిని తరలించే ప్రతిపాదనను ఎపి ప్రభుత్వం ముందుకు తెస్తోంది. గోదావరి నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని సద్వి నియోగం చేసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని సిఎం చంద్రబాబు భావిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేయాలన్నది ఎపి ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రతిపాదనలపై చర్చించేందుకు తమిళనాడు సిఎం విజయ్ చొరవ తీసుకున్నారు. ఈక్రమంలోనే చెన్నై >>2



మంగళవారం విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమానికి హాజరైన తమిళనాడు సిఎం విజయ్‌కు మెమెంటో అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపి కేశినేని చిన్ని

## ఆంధ్ర-తమిళనాడు రాష్ట్రాలు వేరైనా

# అభిమతం ఒక్కటే

### విజయవాడకు రావడం.. ఇక్కడి ప్రజలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్న తమిళనాడు సిఎం విజయ్.. తెలుగులో ప్రసంగం 3లో

### నదుల అనుసంధానంపై చంద్రబాబుతో చర్చించడానికి వచ్చానని వెల్లడి

### దుర్గమ్మ ఆశీస్సులతో గోదావరి కావేరి అనుసంధానం : చంద్రబాబు



## 3 పిటిషన్లు డిస్మిస్

### డిఎస్సీ నియామకాల న్యాయ విచారణలో కీలక పరిణామం

### 2008 నాటి నోటిఫికేషన్‌పై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డిఎస్సీ 2008 ఉపా ధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి మంగళవారం తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3 రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయిం చగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డిఎస్సీ 2008 నియామకా లకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2008 డిసెంబర్‌లో ఉపా ధ్యాయ పోస్టుల భర్తీకోసం డిఎస్సీ నోటిఫి కేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ >>2

## స్థానిక ఎన్నికలు

# నేడు నోటిఫికేషన్

- మూడు దశల్లో నిర్వహణ
- రాజకీయ పార్టీలతో సమావేశం
- ప్రశాంతంగా నిర్వహణపై చర్చ
- గవర్నర్‌తో ఎస్ఇసి పునేఠా భేటీ
- ఎన్నికలపై సమాచారం అందజేత



**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఈ నెల 14వ తేది బుధవారం షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు సమా చారం. దీంతోపాటు 100 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వనుంది. మిగిలిన 23 స్థానాలకు ఇంకో రోజు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ మేరకు ఎస్ఇసి ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఇసి) అనిల్ చంద్ర పునేఠా సమావేశం నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేస్తున్న విషయాన్ని తెలియజేసి, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు ప్రభుత్వం సోమవారం రిజర్వేషన్లు ప్రకటించింది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఎన్నికల కమిషన్‌కు లేఖ ద్వారా తెలిపింది. ఈ మేరకు మున్సిపల్, ఎంపిటిసి, జడ్‌పిటిసి, గ్రామ పంచా యతీ ఎన్నికలకు ఒకేసారి షెడ్యూల్ ప్రకటించడంతో పాటు ముందుగా పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.

**మూడు దశల్లో ఎన్నికలు**

ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు ఒకే దశలో నిర్వహించను న్నారు. రెండుదశల్లో నిర్వహించాలని పదిజిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి వినతులొచ్చినా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఒకే దశలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఈ విషయాన్ని కలెక్టర్లు, ఎస్పీ లకు స్పష్టం చేసింది. గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ల స్థానాలకు రిజర్వేషన్లపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ గెజిట్ విడుదల చేసింది. ఎంపిటిసి, జడ్‌పిటిసి,సర్పంచ్‌లు, వార్డు సభ్యుల >>2

## రహదారులతో

# పల్లె ప్రగతి

### ఆత్మకూరులో రూ. 8.91 కోట్లతో నాలుగు లేన్స్ రహదారి అభివృద్ధి

### రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం

### వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**ఆత్మకూరు (నెల్లూరు), అక్టోబరు 13, ప్రభాతవార్త:** గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్67 నుంచి ఆత్మ కూరు బైపాస్ వరకు రూ.8.91 కోట్ల వ్యయంతో నాలుగు లేన్స్ రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మొత్తం 2.2 కిలోమీటర్ల మేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఈ రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆత్మకూరు రహదారిని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన 67వ జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు నాలుగు వరుసల రహదారి >>2

## సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు

- ఇటు సిఎం చంద్రబాబుతో బిజెపి చీఫ్ మాధవ్ భేటీ
- అటు డి.సిఎం పవన్‌తో మంత్రి నిమ్మల, టిడిపి ఎపి చీఫ్ పల్లా చర్చలు
- రాత్రి చంద్రబాబు నివాసంలో కూటమి అగ్రనేతల భేటీ



**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయి. కూటమిపార్టీల్లో ఎవ్వరి ఎన్నిమున్సిపాలిటీలచైర్మన్లు, మేయర్లు కేటాయించాలనే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా కసరత్తుచేస్తున్నారు. జనసేన సీట్లలెక్కలు తేల్చాక బిజెపితో చర్చ లకు వెళ్లాలని నిర్ణయించారు. జనసేన అధినేత పవన్‌తో, ఆ పార్టీ నేతలతో టిడిపి నేతలు చర్చలు జరిపారు. టిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా జనసేన కార్యాలయానికి వెళ్లి పవన్‌తో సంప్రదింపులు జరిపారు. జనసేన నేతలతో భేటీ అనంతరం ఉండవల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయానికి పల్లాశ్రీనివాస్, నిమ్మల రామానా యుడు వెళ్లారు. జనసేన అధినేత, ఆ పార్టీ నేతలతో జరిగిన చర్చల >>2

## టీచర్ ఉద్యోగార్థులకు గుడ్ న్యూస్..

### 2,721 పోస్టులతో

# డిఎస్సీ నోటిఫికేషన్

### - ప్రభుత్వం ఉత్తర్వులు

**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం కీలక సమా చారం వెల్లడించింది. డిఎస్సి 2026 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2,721 >>2

## నేడు విజయవాడకు రాష్ట్రపతి రాక

### సాయంత్రం దుర్గమ్మను దర్శించుకోనున్న ముర్ము



**విజయవాడ (గన్నవరం), అక్టోబరు 13, ప్రభాతవార్త :** భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రెండురోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం బుధవారం రానున్నారు. ఈమేరకు గన్నవరం విమానాశ్రయం పరిసర ప్రాంతాలు రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్రపతి రాక సందర్భంగా జిల్లాకలెక్టర్ బాలాజీ గన్నవరం విమానాశ్రయంలో అధికారు లతో సమావేశం అయ్యారు. రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. బుధవారం న్యూఢిల్లీ నుండి వాయుసేన ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం 6.25గంటలకు గన్న వరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఇక్కడి నుండి రోడ్డుమార్గాన విజయవాడ వెళతారు. అనం తరం దసరా ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. గురువారం సరస్‌మేళాను ప్రారంభించిన అనంతరం విజయవాడనుండి రోడ్డు మార్గాన 2.30గంటలకు గన్నవరం విమానాశ్రయా నికి చేరుకుని ఇక్కడి నుండి వాయుసేన ప్రత్యేక విమానంలో న్యూడిల్లీ వెళతారు.

## ఐసర్‌లో 2+2 డ్యూయల్ డిగ్రీ

### మెల్‌బోర్న్ వర్సిటీతో కీలక ఒప్పందం

### వచ్చే యేడాది నుంచి ప్రారంభం

### ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య వెల్లడి

**శ్రీకాళహస్తి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలో ఏర్పేడు మండలంలో ఏర్పాటు చేసిన ఐసర్ దేశంలోనే నంబర్‌వన్ విద్యాసంస్థగా గుర్తింపు నకు ప్రయోగాలు చేస్తున్నారు. అందరిని ఆకట్టుకునే రీతిలో ఇక్కడ విద్యావిధానాన్ని రూపొందించుకొని ముందుకు వెళుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యేడేళ్లలోనే ఎన్నో సత్ఫలితాలను సాధించారు. మంగళవారం ఐసర్‌లో ప్రతిభావంతులైన విద్యార్థు లకు అంతర్జాతీయస్థాయి పరిశోధన విద్యను అందిం చాలనే లక్ష్యంతో మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం, తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకొనుటకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా నూతన ద్వంద్వ డిగ్రీ (డ్యూయల్‌డిగ్రీ) కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఢిల్లీలోని మెల్‌బోర్న్ గ్లోబల్ సెంటర్‌లో ప్రకటించిన ఈకొత్త బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇంటిగ్రే టెడ్ (ఆనర్స్) 2+2 డ్యూయల్ >>2



# ఉచ్చు బిగుస్తోంది

### ప్రధాని మోడీ, అమిత్‌షా, జ్ఞానేశ్ ఇక తప్పించుకోలేరు..

### ప్రజాస్వామ్య పరక్షణకే మా పోరాటం

### సమైక్యంగా ఇండియా కూటమి: రాహుల్

### సిఇసి రాజీనామా చేయాలి లేదా తొలగించాలి: ఖర్గే

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌లు తమ చుట్టూ ఉచ్చు బిగుస్తోందనే విషయాన్ని అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం తన నివాసంలో ప్రతిపక్ష నేతలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ ప్రతినిధు లతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, జేఎంఎం ఎంపీ మహువా మాజి, వామపక్ష నేతలు ఎం.ఎ. బేబీ, డి. రాజా, ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే, ఎఐఎస్ఎ అధ్యక్షురాలు నేహా బోరా తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయనే >>2

## అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు జీతాలేవ్!

- 401 పోస్టులకు నోటిఫికేషన్.. 391 మందికి నియామకాలు
- బడ్జెట్ రాలేదంటున్న అధికారులు
- జీతాల కోసం ఎదురుచూపులు
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి

**అనంతపురం(న్యూటౌన్), అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు సహకరించేందుకు నియమితులైన అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు జీతాల కష్టాలు మొదలయ్యాయి. విధుల్లో చేరి నెలకు పైగా గడుస్తున్నా వేతనాలు అందకపో వడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిమిత వేతనాలతో పనిచేస్తున్న తమకు కనీసం జీతాలైనా సకాలంలో చెల్లించలేరా? అని ప్రశ్నిస్తున్నారు. బడ్జెట్ విడుదల కాలేదని విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు చెబుతుండటంతో చెల్లింపుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

**401 పోస్టులకు నోటిఫికేషన్.. 391 మందికి నియామకాలు:** అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఆగస్టు 15న 401 పోస్టు లతో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 179 ఎస్‌జిటి, 222 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. నియామక ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ మొదటి వారంలో 391 మందిని విధుల్లోకి తీసుకున్నారు. అయితే అక్టోబర్ 13 వచ్చినా వేతనాలు అందకపోవడం గమనార్హం. నియా >>2

14-10pg2exHMNWJQE.qxd:14-10pg2exHMNWJQE.qxd 1/1/02 8:00 AM Page 1



# కలిసి నడుద్దాం

>> మంచినీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా ఈ యేడాది ఏపి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసింది. తెలుగు గంగ నుంచి మరింత నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం కోరుతుండగా నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ఏపి ప్రభుత్వం తెలిపింది. మానవీయ కోణంలో చెన్నై మంచినీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలో తమిళనాడు సిఎం విజయ్, ఏపి సిఎం చంద్రబాబును కలిసారు. సమావేశానికి ముందు చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విజయ్‌కు తమ నివాసం వద్ద సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, మంగళగిరి శాలువాతో సత్కరించారు. సమావేశం ముగిసిన అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్లారు.

**తమిళనాడు సిఎం విజయ్‌కి ఘన స్వాగతం:**
తమిళనాడు సీఎం విజయ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయనకు మంత్రి నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అధికారులు గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం విజయ్ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఎంపి కేశినేని చిన్ని, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఘనంగా ఆహ్వానించారు. ఆలయ ధ్వజస్తంభానికి మొక్కిన అనంతరం, అంతరాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో విజయ్ పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. విజయ్‌ను చూసేందుకు ఆలయ పరిసరాల్లో అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి నినాదాలు చేసారు.



మంగళవారం సిఎం చంద్రబాబు నివాసంలో సమావేశమైన తమిళనాడు సిఎం విజయ్, తమిళనాడు, ఏపి మంత్రులు



మంగళవారం ఆత్మకూరు బైపాస్ రోడ్ ప్రారంభోత్సవంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు

>> విస్తరణ పనులు సాకారం కావడం ఎంతో సంతోషకరం. ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చే లక్ష్యంతో మొత్తం రూ.8.91 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాం. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు చేపట్టిన ఈ పనుల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6.31 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని విస్తరించాం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల ద్వారా రూ.2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టనున్నాం. ఆత్మకూరు పట్టణ ప్రజలు నిత్యం జాతీయ రహదారి ఎన్‌హెచ్67కు చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడంతో జాతీయ రహదారిని తలపించేలా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రహదారిని అభివృద్ధి చేశాం. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉంది. భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నాం అని అన్నారు.

**పల్లె పండుగతో గ్రామీణ రహదారుల అభివృద్ధి:**
రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకుపైగా సిసి రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బిటి రోడ్ల మంజూరు చేశాం. ఆ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సిసి రోడ్లు, 9,500 కిలోమీటర్ల బిటి రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని తన ప్రసంగం కొనసాగింపులో డి.సిఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అన్నారు.

**వీర్లగుడిపాడు వంతెన నిర్మాణానికి చర్యలు వేగవంతం:**
సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అదేవిధంగా, తాగునీటి సమస్యను ప్రస్తావించగా.. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 'జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధార' కింద ఇప్పటికే రూ.72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూనాయక్ పాల్గొన్నారు.

# 3 పిటిషన్లు డిస్మిస్

>> ద్వారా మొత్తం 52,655 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. వాటిలో 30,558 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు బిఇడి, డిఇడి అర్హతలున్న అభ్యర్థులు పోటీపడే అంశం వివాదానికి ప్రధాన కారణం అయింది. నోటిఫికేషన్ రిలీజ్ అయిన తర్వాత 2009 జనవరి 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 28ను జారీ చేసింది. ఈ జీవో నంబర్ 28 ద్వారా ఎస్‌జీటీ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులకు కేటాయిస్తూ.. మిగిలిన 70 శాతం పోస్టులకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు పోటీపడే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు.నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చడం వల్ల తమకు నష్టం జరిగిందని కొందరు బీఈడీ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్ 7కు ప్రొవిజన్ జోడించడం.. జీవో నంబర్ 28 ద్వారా తీసుకొచ్చిన మార్పులు న్యాయబద్ధమైనవి కావని వారు వాదించారు. అసలు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు న్యాయపోరాటం ప్రారంభించారు. తొలుత అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన అనంతరం.. ఈ వివాదం న్యాయస్థానాల ముందుకు వెళ్లింది. డిఎస్సీ 2008 ప్రక్రియలో మెరిట్ సాధించినప్పటికీ.. నిబంధనల మార్పుల కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోయామని బిఇడి అభ్యర్థులు తమ వాదనల్లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసి.. మొదట ప్రకటించిన విధానం ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. తాజాగా ఈ అంశానికి సంబంధించి దాఖలైన 3 రిట్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం వాటిని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఆయా ప్రభుత్వాలు తమ పరిధిలో నియామకాలకు సంబంధించిన చర్యలను కొనసాగించాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు కూడా ఇచ్చిన నేపథ్యంలో.. జీవో నంబర్ 28 సవరణకు సంబంధించి పిటిషనర్లు కోరిన విధంగా ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది.ఈ తీర్పు వెలువడటంతో జీవో నంబర్ 28 రూల్ 7లోని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన తాజా 3 పిటిషన్లపై విచారణ ముగిసింది. అయితే ఈ తీర్పు ప్రభావం ఇప్పటికే నియామకాలు పొందినవారి పరిస్థితులు, భవిష్యత్ ప్రయోజనాలు, ఇతర సంబంధిత అంశాలపై ఎలా ఉంటుందన్నది పూర్తి తీర్పు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది.

# అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు జీతాలేవ్!

>> మక ప్రక్రియను వేగంగా పూర్తి చేసిన అధికారులు, వేతనాల చెల్లింపుల్లో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

**అరకొర వేతనం.. అదీ సకాలంలో అందకపోతే ఎలా?:**
అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు ఎస్‌జీటీ పోస్టులకు నెలకు రూ.10 వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.12,500 చొప్పున వేతనం అందిస్తున్నారు. ఈ మొత్తంతోనే కుటుంబ అవసరాలు, ప్రయాణ ఖర్చులు, ఇతర నిత్యావసరాలను నిర్వహించుకోవాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో నెలవారీ వేతనాలు కూడా సకాలంలో అందకపోతే ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు హాజరవుతూ విద్యార్థులకు బోధనా సహకారం అందిస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

**బడ్జెట్ ఎప్పుడు వస్తుంది.. జీతాలు ఎప్పుడు చెల్లిస్తారు? :**
బడ్జెట్ రాలేదనే కారణంతో వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నట్లు సమాచారం. అయితే నిధుల విడుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి? బిల్లులు ఏ దశలో ఉన్నాయి? వేతనాలు చెల్లించేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది? అనే అంశాలపై స్పష్టత కరవైంది. నియామకాలు పూర్తి చేసి విధుల్లోకి తీసుకున్న సిబ్బందికి వేతనాలు అందించే బాధ్యతను అధికారులు విస్మరించకూడదని ఇన్‌స్ట్రక్టర్లు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయడంతోపాటు, ప్రతి నెలా నిర్ణీత సమయంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపైన వివరణ అడగడానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎన్.అయూబ్ హుస్సేన్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

# నేడు నోటిఫికేషన్

>> స్థానాలకు కూడా రిజర్వేషన్లపై కలెక్టర్లు గెజిట్ ఇవ్వనున్నారు. వీటిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు ఎస్ఇసికి అందజేసి ఎన్నికలకు సన్నద్ధతను తెలియజేయనున్నారు. జడ్పీ ఛైర్మన్ స్థానాలకు రిజర్వేషన్లపై సందేహాలను నివృత్తి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ, జడ్పీ సిఇఒలు, జిల్లా పంచాయతీ అధికారులతో సోమవారం సమావే శమయ్యారు. రిజర్వేషన్లు ఏవిధంగా ఖరారు చేయాలన్న దానిపై పంచాయతీరాజ్ శాఖ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవడం, వివిధ అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

**త్వరలోనే స్థానిక పోలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తాం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ**
ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక స్పష్టత వచ్చాక, త్వరలోనే స్థానిక పోలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘంఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కీలక సమావేశం నిర్వహించామని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. రాష్ట్రంలోని 20 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు గాను, ఒక్క పార్టీ మినహా మిగతా 19 పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజయరయ్యారని చెప్పారు. సంబంధిత విభాగాల నుంచి గెజిట్ నోటిఫికేషన్ రావాలని, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం తెలిపిన తరువాతే నోటిఫికేషన్ గురించి ఆలోచిస్తామని తెలిపారు.ఎన్నికల్లో ఓటర్లను ప్రభా వితం చేసే మద్యం ప్రవాహాన్ని కంట్రోల్ చేయాలని ఎన్నికల సంఘానికి సూచించారని చెప్పారు. పండుగ రోజులను బట్టి ఎన్నికల షెడ్యూల్ లేదా తేదీలను పరిశీలించాలని రాజకీయ పార్టీల కోరాయని ఎస్ఇసి తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు, నామినేషన్ కేంద్రాలవద్ద తగిన భద్రతాఏర్పాట్లు చేయాలని అభ్యర్థన వచ్చిందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు పకడ్బందీగా సిసిటివి కవరేజ్ ఏర్పాటు చేయాలని కోరారని అన్నారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగా లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారని అనిల్ చంద్ర తెలిపారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన అన్ని సలహాలు, అభిప్రాయాలను పరిశీలించి తగినచర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ పత్రాలను తీసుకోవాలంటూ రాజకీయ పార్టీలు చేసిన విజ్ఞప్తిని కన్సిడర్ చేస్తామని ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు.

# సీట్ల సర్దుబాటుపై చర్చోపచర్చలు

>> సారాంశాన్ని సిఎం చంద్రబాబుకు వివరించారు. జనసేన చేసిన ప్రతిపాదనలపై సిఎం వద్ద చర్చించారు కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటు విషయమై చర్చోపచర్చలు సాగుతున్నాయి. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ, గెలుపు అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సీట్ల పంపకాన్ని పూర్తి చేయడం మూడు పార్టీలకు కీలకంగా మారింది. తొలుత సిఎం చంద్రబాబుతో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి రామానాయుడుతో సమావేశమై చర్చించారు. ఆ తర్వాత పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు జనసేన కార్యాలయానికి వెళ్లారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, ఎంపి లింగమనేని, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సిఎం చంద్రబాబునుకలిసి సీట్ల సర్దుబాటుపై మాట్లాడారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు, కీలక ప్రాంతాల్లో అభ్యర్థుల ఎంపికపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశముంది.

**సిఎం చంద్రబాబును కలిసిన బిజెపి ఎపి చీఫ్ మాధవ్**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మంగళవారం సిఎం చంద్రబాబును కలిసారు. కూటమి పక్షాల సమావేశంలో భాగంగా తమ పార్టీ ఆశిస్తున్న స్థానిక సంస్థలు,నగరపాలక సంస్థల గురించి సిఎం చంద్రబాబుకు వివరించారు. స్థానిక ఎన్నికల్లో సీట్ల కేటాయింపు పైన కూటమిలో తుది దశ చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మూడు పార్టీలు ఏ నిష్పత్తిలో పోటీ చేయాలనే అంశం పైన ఒక నిర్ణయానికి వచ్చాయి. రిజర్వేషన్ల ఖరారుతో తమ అంచనాలు మారాయంటూ తాజాగా సిఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంలో జనసేన, బిజెపి కొంత అసంతృప్తి వ్యక్తం చేసారు.

## వారం - వర్జ్యం

14-10-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి. చవితి రా.1.15
న. అనూరాధ తె.4.04
వ.ఉ.6.08-ఉ.7.53
దు. ఉ.11.29-మ.12.16
రాహు మ.12.00-మ.1.30
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు.

**వృషభం :** వాయిదాల మీద వాయిదా పడుతున్న కార్యక్రమాలను సానుకూల పరచుకుంటారు. చిరుతిండ్లకు ప్రాముఖ్యతనిస్తారు.

**మిథునం :** ధన వ్యయం అధికంగా వుంటుంది. వ్యాపారస్తులకు అనుకూలం. జీవితాన్ని కొత్తకోణంలో చూస్తారు.

**కర్కాటకం :** చిన్నపాటి ప్రయాణాలను సాగిస్తారు. గతానుభవం నేడు ఉపకరిస్తుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం :** స్థిరాస్తులకు సంబంధించిన అంశాలు సానుకూల పడతాయి. ప్రచారంలో ఉన్న పుకార్లను నమ్ముతారు.

**కన్య :** సాంకేతిక కారణాల వలన అపార్థాలు చోటు చేసుకుంటాయి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

**తుల :** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కొనుగోలు అమ్మకాల వలన లాభపడతారు.

**వృశ్చికం :** ఆర్థికంగా ఇబ్బందులేవీ ఏర్పడవు. వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**ధనుస్సు :** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఆలోచింప చేస్తాయి. దైవ దర్శనం చేసుకుంటారు.

**మకరం :** గతంలో దూరమైన ఒక వర్గంతో తిరిగి నేడు సఖ్యత ఏర్పడుతుంది. గుప్తదానం చేస్తారు. వివాదాలకు దూరంగా ఉంటారు.

**కుంభం :** దురభ్యాసాలకు దూరంగా వుండాలని నిర్ణయించుకుంటారు. విదేశీ వ్యవహారాలు లాభిస్తాయి.

**మీనం :** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఉచ్చు బిగుస్తోంది

>> ఆరోపణలతో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్ష నేతలు మరోసారి డిమాండ్ చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగే విధానాన్ని ఎన్నికల సంఘం దెబ్బతీస్తోందని ఆరోపించారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఇండియా కూటమి ఐక్యంగా ఉందని, వేర్వేరు వర్గాలు వేర్వేరుగా నిరసనలు చేపడుతున్నాయన్న వాదనలను తోసిపుచ్చారు. 'మేమంతా ఇక్కడ ఒకే వేదికపై ఐక్యంగా నిలబడ్డాం. నిన్న చెప్పినట్లుగానే, సమాంతర నిరసనలు ఏవీ లేవు. ఇది ఒకే నిరసన. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే ఈ ఉద్యమం లక్ష్యం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నిరసనలకు మద్దతు తెలిపిన ఢిల్లీ ప్రజలకు, ఇతరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉద్యమం రాజకీయ పార్టీలకు మాత్రమే పరిమితం కాదని పేర్కొన్నారు. ఇది మా గురించి కాదు. భారత ప్రజల గురించి, వారి భవిష్యత్తు గురించని రాహుల్ గాంధీ అన్నారు. సుప్రీంకోర్టు, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని, ఈ ప్రక్రియలో వారు తమ పాత్రను సమర్థంగా పోషిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత నిరసనలను ప్రజలకు, అధికారంలో ఉన్న బిజెపికి మధ్య జరుగుతున్న ఉమ్మడి పోరాటంగా ఏఐఎస్‌ఏ అధ్యక్షురాలు నేహా బోరా అభివర్ణించారు. 'ప్రజలమైన మేము వర్సెస్ బిజెపి అని చెప్పినప్పుడు, మేము ఒకే పోరాటం గురించి మాట్లాడుతున్నామని ఆమె అన్నారు. ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేయవచ్చని, ప్రజలు తమ ఓటు హక్కు కోసం వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపినా వారిని మౌనంగా ఉంచవచ్చని బిజెపి భావిస్తే అది పొరపాటేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను బిజెపి దెబ్బతీయవచ్చు. కానీ భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పోరాడి ప్రాణత్యాగాలు చేసిన సామాన్య ప్రజలు దొంగిలించిన ప్రజా తీర్పును లేదా రాజీపడిన ప్రజాస్వామ్యాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరని నేహా బోరా వ్యాఖ్యానించారు.

# డిఎస్సీ నోటిఫికేషన్

>> టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి, నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి నోటిఫికేషన్‌ను నవంబరు 3, 2026లోపు విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ నియామకాల్లో జనరల్ స్కూళ్లకు సంబంధించి 2,111 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 350 పోస్టులు, సొసైటీలు, ఇతర యాజమాన్యాల పరిధిలో 260 పోస్టులు ఉన్నాయి. పోస్టుల విభజనలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 906, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి) పోస్టులు 1,205 ఉన్నాయి.
స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 150 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 200 ఎస్‌జిటి పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితోపాటు 30 ప్రిన్సిపాల్ పోస్టులు, 81 పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పిజిటి) పోస్టులు, 113 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి) పోస్టులు, రెండు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు, 34 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఇటి) పోస్టులు ఉన్నాయి. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించనున్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. డిఎస్‌సి2026కు సంబంధించిన సిలబస్ ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు సమాచారం. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు సిలబస్‌ను పరిశీలించవచ్చు. జిల్లాల వారీగా, సొసైటీల వారీగా ఖాళీల వివరాలను పూర్తి నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు. తుది ఖాళీల సంఖ్య, అర్హతలు, దరఖాస్తుల గడువు, పరీక్షల షెడ్యూల్ వంటి పూర్తి వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొననున్నారు.

# పాపికొండల విహారయాత్ర షురూ

>> యిన పర్యాటక బోట్ల రాకపోకలకు అధికారులు పచ్చజెండా ఊపారు. నదిలో వరద ఉధృతి తగ్గి, నీటిమట్టం అనుకూలంగా ఉండ టంతో బోటింగ్ పునఃప్రారంభానికి అనుమతులు మంజూరు చేశారు. పోచమ్మగండి బోటింగ్ పాయింట్ నుంచి రెండు బోట్లలో సుమారు 130 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు బయలుదేరాయి. గోదావరి అందాల వీక్షణ కోసం పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ తల్లి ఆలయం సమీపంలోని బోటింగ్ పాయింట్‌నుంచి పర్యాటకబోట్లు ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ యాత్ర సాయంత్రం 5గంటల వరకు కొనసాగ నుంది. రాజమహేంద్రవరంనుంచి పర్యాటకులను బస్సుల్లోపోలవరం ప్రాజెక్టుమీదుగా గండి పోచమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చే ఏర్పాట్లు ఉన్నాయి.

**దసరా సెలవులతో పెరగనున్న రద్దీ:**
దసరా సెలవుల నేపథ్యంలో పాపికొండల విహార యాత్రకు పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రాజమహేంద్ర వరానికి సమీపంలో ఉండటంతో పాటు గోదావరి నదీ ప్రయాణం, పచ్చని కొండల అందాలు పర్యాటకులను ఆకర్షించనున్నాయి. బోటింగ్ నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న బోటు యజమానులు, స్థానిక పర్యాటక రంగంపై ఆధారపడిన వర్గాలకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. పర్యాటకుల రాక పెరిగితే స్థానికంగా ఉపాధి, వ్యాపారాలకు ఊపొచ్చే అవకాశం ఉంది.

# వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పదవుల పదవీ కాలం పొడిగింపు

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల పదవీకాలాన్ని మరో రెండు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు తమ విధుల్లో కొనసాగనున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనుల అమలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వాటిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న నేతల పనితీరు, శాఖల మధ్య సమన్వయం ఆధారంగా ఈ పొడిగింపు వర్తిస్తుందని తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ పొడిగింపు కాలంలో ప్రజాసేవలో మరింత చురుగ్గా పనిచేస్తామని వారు తెలిపారు. ఈ పొడిగింపుతో అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

# ఎపి అధికారిపై బెంగళూరులో క్రిమినల్ కేసు

## సిఎం చంద్రబాబు సీరియస్, నివేదికివ్వాలని సిఎస్‌కు ఆదేశం

**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన యువ ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ బెంగళూరులో తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. నగరంలోని ఓ పబ్‌లో పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలపై ఆయనతో పాటు ఆయన స్నేహితులపై అక్కడి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లగా, దీనిపై ఆయన తీవ్రంగా స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరపాలని సిఎస్‌ను ఆదేశించినట్టు తెలుస్తోంది. అక్టోబరు 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత బెంగళూరు రెసిడెన్సీ రోడ్డులోని కావోర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సిసిబి) పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా సమయం దాటినా పబ్ నడుపుతుండటంతో పాటు, వయసు నిర్ధారణ కోసం అక్కడ ఉన్న వారి ఐడి కార్డులను పరిశీలిస్తున్నారు. ఆ సమయంలో అక్కడే స్నేహితులతో ఉన్న వికాస్ మర్మత్, పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది.
మద్యం మత్తులో ఉన్న ఆయన, పోలీసులను దూషించడమే కాకుండా, వారిపై దాడికి ప్రయత్నించి విధులకు ఆటంకం కలిగించారని సిసిబి ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు ఆయన స్నేహితులు అభయ్, ఉదయ్ సింగ్, నితీష్, రోషన్‌లపై వివిధ సెక్షన్ల కింద కేసు (క్రైమ్ నం. 150/2026) నమోదు చేశారు. వికాస్ మర్మత్ 2019 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడం గమనార్హం. ఉన్నత హోదాలో ఉన్న అధికారి ఇలాంటి వివాదంలో చిక్కుకోవడంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను సిద్ధం చేయనున్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# 2+2 డ్యూయల్ డిగ్రీ

>> డిగ్రీ కార్యక్రమం పరిశోధనకు ప్రాధాన్యతనిచ్చే రెండు సంస్థల నైపుణ్యాల సమన్వయంతో రూపొందించబడింది. ఈ నాలుగేళ్ల కార్యక్రమంలో విద్యార్థులు మొదటి రెండేళ్లు ఐసర్ తిరుపతిలో, తదుపరి రెండేళ్లు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో చదువుతారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ రెండు సంస్థల నుండి రెండు బ్యాచిలర్ ఆనర్స్ డిగ్రీలు అందిస్తారు.

**విద్యార్థులకు ఒకే విద్యా డిగ్రీలో రెండు డిగ్రీలు:**
ఈ సందర్భంగా మెల్‌బోర్న్ యూనివర్శిటి వైస్‌ఛాన్సలర్ ఫ్రాంక్ వెటేరే మాట్లాడుతూ విద్యార్థులు బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకోసిస్టమ్ సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఫుడ్ సైన్స్, జెనెటిక్స్, ఫిజిక్స్, ప్లాంట్ సైన్స్ వంటి విభిన్న రంగాల్లో మేజర్ ఎంచుకోవచ్చు. అంతేకాకుండా మాస్టర్స్ డిగ్రీలో అడ్వాన్స్‌డ్ స్టాండింగ్ సదుపాయంతో తక్కువ సమయంలోనే తదుపరి డిగ్రీని పూర్తి చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ఆటోమేటిక్‌గా సైన్స్ గ్లోబల్ స్కాలర్స్ ప్రోగ్రామ్‌లో భాగమవుతారు. ఈ సందర్భంగా మెల్‌బోర్న్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ (గ్లోబల్) ప్రొఫెసర్ ఫ్రాంక్ వెటెరే వివరించారు. ఈ కొత్త కార్యక్రమం వర్ధమాన శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ అనుభవాన్ని, ప్రపంచ సవాళ్లను పరిష్కరించే నైపుణ్యాలను అందిస్తుందని అన్నారు. భారతదేశంలో చైతన్యవంతమైన సైంటిఫిక్ కమ్యూనిటీ ఉందని, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల మధ్య పరిశోధన, విద్యా సంబంధాలను బలోపేతం చేస్తుందని తెలిపారు. సైన్స్ డీన్ ప్రొఫెసర్ మోయిరా ఒఖ్రియన్ మాట్లాడుతూ



మంగళవారం మెల్‌బోర్న్ యూనివర్సిటీతో ఎంఒయు కుదుర్చుకున్న ఐసర్

ఇది సైన్స్ ఎడ్యుకేషన్ భవిష్యత్తులో ఒక ముఖ్యమైన పెట్టుబడిగా నిలుస్తుందని, ఆస్ట్రేలియా-భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ఐసర్ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులకు రెండు విభిన్న విద్యా వాతావరణాల్లో పరిశోధన ఆధారిత అభ్యాసాన్ని, అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఏర్పరచుకునే అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు. ఇది భారతదేశ అంతర్జాతీయ విద్యా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు.

**ఫ్రాంటియర్స్ ఆఫ్ సైన్స్ కార్యక్రమం:**
ఈ భాగస్వామ్యంలో భాగంగా వచ్చే నెలలో మెల్‌బోర్న్ యూనివర్సిటీ, తిరుపతి సంయుక్తంగా ఫ్రాంటియర్స్ ఆఫ్ సైన్స్ ఫర్ గ్లోబల్ అడ్వాన్సెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. భారతదేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ, వాతావరణ శాస్త్రం, క్వాంటం టెక్నాలజీలు, పర్యావరణ వ్యవస్థలు, వ్యవసాయం, సుస్థిరత వంటి రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలపై ప్రముఖ పరిశోధకులు ప్రసంగించనున్నారు.



# సరస్వతీమూర్తిగా శ్రీనివాసుడు

**● హంసవాహనంపై వేంకటేశ్వరుడు అభయం**

**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** చేతిలో వీణ, అలంకారం సరస్వతిదేవి రూపంలో శేషాచలదీశుడు వేంకటేశ్వరుడు భక్తులను కటాక్షించాడు. తిరుమలలో మొదలైన నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు మంగళవారం రాత్రి మలయప్పస్వామి వీణాపాణిగా సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచా ్చరు. హంస అనే పదానికి అనేక అర్థాలున్నాయి. శ్రీనివాసుడు హంసవాహనంపై ఊరేగడం ఆనందదాయకం. మానస సరోవరంలో హంసలు విహరిస్తాయి. పరమాత్మ యోగిపుంగవుల మనస్స రస్సు లలో విహరిస్తారు. హంస స్వరూపుడైన దేవదేవుడు వీణాపాణిగా రాత్రి 7 గ ంటల నుండి 9గంటల వరకు తిరువీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాప్రదర్శనల నడుమ స్వామివారి వాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, పాలకమండలి సభ్యులు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

# అమరావతిలో మరో కీలక అడుగు

**● క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు శంకుస్థాపన ● టవర్స్ పూర్తయితే 25వేల మందికి ఉద్యోగాలు: మంత్రి నారాయణ**



క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ కు మంత్రి నారాయణ శంకుస్థాపన

**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే దిశగా మరో భారీ అడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ 'క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఉద్దండరాయుని పాలెంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న క్వాంటం వ్యాలీ 11 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఐకానిక్ ట్విన్ టవర్స్ పనులకు మంత్రి పి.నారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. మొత్తం 37,48,847 చదరపు అడుగుల విస్తీర్ణంతో కలిగిన ఈ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నారు. క్వాంటం వ్యాలీలో మొత్తం ఎనిమిది టవర్లను నిర్మించాలని తలపెట్టామని, అందులో భాగంగానే ఈ మొదటి రెండు టవర్ల నిర్మాణం ప్రారంభమైందని మంత్రి నారాయణ వివరించారు. రక్షణ, వైద్యం, బ్యాంకింగ్ రంగాలతో పాటు ప్రకృతి వైపరీత్యాల నష్ట నివారణలో క్వాంటం కంప్యూటింగ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. అత్యాధునిక క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా రాజధాని ప్రాంతంలో సుమారు 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు.

# భాస్కర్ రెడ్డిపై ఇడి ప్రశ్నలవర్షం

**● 8 గంటల పాటు విచారించిన అధికారులు**

**● నేడు కడప ఎంపి అవినాష్ రెడ్డి హాజరు**

**హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) విచారణ వేగం పుంజుకుంది. వివేకా హత్యకు రూ.40 కోట్ల చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ అవడంతో మనీలాండరింగ్ కోణంలో సాగుతున్న ఇడి విచారణకు మంగళవారం వైకాపా నేత వైఎస్ భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన రాగా రాత్రి ఏడు గంటల వరకు విచారణ కొనసాగింది. వివేకా హత్య కేసులో నిందితుల గురించి సిబిఐ విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతుండడం తెలిసిందే. ఈ కేసులో 20 రోజుల వ్యవధిలో ఎ1గా వున్న ఎర్ర గంగిరెడ్డి, ఎ2గా వున్న సునీల్ యాదవ్, అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఎ5గా వున్న దేవిరె డ్డి శివశంకర్ రెడ్డిని విచారించిన ఈడీ అధికారులు తాజాగా కడప ఎంపి అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డిని భిన్న కోణాల్లో ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు రూ.40 కోట్లు చెల్లించినట్లు ఆధారాలు సేకరించిన ఇడి అధికారులు ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సమకూర్చారు? అనే అంశాలపై భాస్కర్ రెడ్డిని ప్రశ్నించారని తెలిసింది. ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఇడి అధికారులు మిగతా నిందితులను ప్రశ్నించినట్లుగానే భాస్కర్ రెడ్డిని కూడా విచారించినట్లు తెలిసింది. ఇడి అధికారుల ప్రశ్నలకు భాస్కర్‌రెడ్డి సమాధానాలు ఇవ్వడంలో తడబడినట్లు తెలిసింది. కాగా ఇదే కేసులో బుధవారం భాస్కర్ రెడ్డి తనయుడు కడప ఎంపి అవినాష్ రెడ్డి హాజరుకానున్నారు.

# ఆంధ్ర- తమిళనాడు రాష్ట్రాలు వేరైనా అభిమతం ఒక్కటే

**● విజయవాడకు రావడం.. ఇక్కడి ప్రజలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్న తమిళనాడు సిఎం.. తెలుగులో విజయ్ ప్రసంగం ● నదుల అనుసంధానంపై చంద్రబాబుతో చర్చించడానికి వచ్చానని వెల్లడి ● దుర్గమ్మ ఆశీస్సులతో గోదావరి-కావేరి అనుసంధానం: సిఎం చంద్రబాబు ధీమా**



**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలు వేరైనా తమ అభిమతం ఒక్కటేనని, దేశం బాగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ మంగళవారం పున్నమి ఘాట్‌లో విజయవాడ ఉత్సవ్ సీజన్ టూలో తమిళనాడు సిఎం విజయ్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ విజయవాడ ఉత్సవ్2.0కు వచ్చి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చారని ఎపి సిఎం చంద్రబాబు తెలిపారు. చంద్రబాబునాయుడు మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ వేదికపై సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లిపోయిందన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి మన రాష్ట్రానికి వచ్చిన విజయ్.. పార్టీ పెట్టిన రెండేళ్ల వ్యవధిలోనే సిఎం కావడం విశేషమని, తమిళనాడు అభివృద్ధికి ఆయన కంకణం కట్టుకున్నారని ప్రశంసించారు. పొరుగు రాష్ట్రాలు కూడా సుభిక్షంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో అసాధ్యమనేది లేదని, దుర్గమ్మ ఆశీస్సులతో గోదావరి- కావేరి అనుసంధానం తప్పక పూర్తవుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి, పెన్నా, కావేరి, తుంగభద్ర.. ఈ ఐదు నదులను అనుసంధానిస్తే దక్షిణాదిలోని నాలుగు రాష్ట్రాలు శాశ్వతంగా బాగుపడతాయని వివరించారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా అవతరిస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ సీజన్ టూలో నిర్వహించిన ఎన్నో కళా ప్రదర్శనలు ఆహుతులను కట్టిపడేశాయని తెలిపారు. ఆకాశమే హద్దుగా అభిమానంతో ఇంత మంది వచ్చారని పేర్కొన్నారు. టెక్నాలజీ, నాలెడ్జ్ మనకు ఉందని.. దీనికి ఆధ్యాత్మికత కూడా తోడు కావాలని అన్నారు. ఇటువంటి ఉత్సవాల ద్వారానే ఆధ్యాత్మికత మరింత పెరుగుతుందని తెలిపారు. ఇటువంటి మరిన్ని ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణ, ప్రత్యేక అతిధిగా వచ్చిన తమిళనాడు సిఎం విజయ్ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించి అక్కడికి వచ్చిన వారిని ఆకట్టుకున్నారు. 'అందరికీ నమస్కారమ్' అంటూ తెలుగులో మాట్లాడిన ఆయన, నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. విజయవాడకు రావడం.. ఇక్కడి ప్రజలను కలుసుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. తనపై అభిమానం చూపించిన ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నదుల అనుసంధానంపై చర్చించేందుకు ఇక్కడకు రావడం ఆనందంగా ఉందని విజయ్ తెలిపారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే అవకాశం లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం వంటి అంశాలు నీటి వనరుల వినియోగం, వ్యవసాయం, ప్రజల అవసరాలకు సంబంధించి ప్రాధాన్యం కలిగి ఉన్న నేపథ్యంలో ఈ భేటీపై ఆసక్తి నెలకొంది. ప్రసంగం చివరలో 'థాంక్యూ విజయవాడ.. మీ అభిమానానికి, నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాల్లు' అంటూ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించడం.. స్థానిక ప్రజలకు ధన్యవాదాలు చెప్పడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమిళనాడు సిఎం విజయ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవ్ నిర్వాహక బాధ్యులు కేశినేని చిన్ని ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ ఘన కీర్తి, గత వైభవం. ఇప్పటి పురోగతిని వివరించేందుకే విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఎంలు ఇద్దరికి ధన్యవాదాలు తెలిపారు, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహనరావు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తదితరులు విజయ్ సత్కరించారు. పున్నమి ఘాట్‌పై ఏర్పాటు చేసిన కళావేదికపై అద్భుత ప్రదర్శనలు జరిగాయి. ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, విజయ్‌లు వాటిని తిలకించి మురిసిపోయారు.

# కొత్తగా 22 డయాలసిస్ కేంద్రాలు

**● రోగుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు ● పేదలకు ఉపశమనం.. సేవల విస్తృతికి ప్రాధాన్యం ● 2025- 26లో డయాలసిస్ సేవలకు రూ.197.88 కోట్లు వ్యయం ● మంత్రి సత్యకుమార్**



**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మూత్రపిండాల(కిడ్నీ) వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం (పిఎంఎన్‌డిపి) కింద కొత్తగా మరో 22 కేంద్రాలు త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగుల అవసరాలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పిఎంఎన్‌డిపి కింద 61 కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. వీటికి అదనంగా కొత్తగా రానున్న 22 కేంద్రాల(మొత్తం 83) ద్వారా ఉచిత డయాలసిస్ (రక్తశుద్ధి) సేవలు పేదలకు మరింత చేరువ అవుతాయని వెల్లడించారు. ఇవి కాకుండా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 170 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ రెండు పథకాల కింద ఉచితంగా అందించే డయాలసిస్ సేవల నిమిత్తం 2025-26లో రూ.197.88 కోట్లు వరకు వ్యయమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇటీవలి వరకు రూ.90.09 కోట్ల విలువైన డయాలసిస్ సేవల్ని పేద రోగులు పొందారు. ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద రాష్ట్రంలో 2019కు ముందు 28 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 2019-24 మధ్య 19 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. 2024-25 నుంచి మరో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా ఇప్పుడు 22 కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిల్లో పలు కేంద్రాల ఏర్పాటులో న్యాయస్థానంలో విచారణ వంటి కారణాలతో జాప్యం జరిగింది. మొత్తం ఈ 22 కేంద్రాలను రోగులకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క డయాలసిస్‌కు ప్రభుత్వం రూ.999 చొప్పున వ్యయం చేయనుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో డయాలసిస్ సెషన్‌కు రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చవుతుంది. రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి నెలకు నాలుగైదు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉండటం బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తుంది. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లాలో పీలేరు ఏరియా ఆసుపత్రి, వైఎస్సార్ కడప జిల్లాలో జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి, మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో కొత్త డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కృష్ణా జిల్లాలో గన్నవరం సామాజిక ఆసుపత్రి, గుడివాడ ఏరియా ఆసుపత్రి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బాపట్ల జిల్లాలో అద్దంకి, రేపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాలు, తిరుపతి జిల్లాలో రైల్వేకోడూరు, సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రకాశం జిల్లాలో కొండెపి, తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, పల్నాడు జిల్లాలో వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి, విజయనగరం జిల్లాలో బొబ్బిలి సామాజిక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నంద్యాల జిల్లాలో డోన్ ఏరియా ఆసుపత్రి, సున్నిపెంట సామాజిక ఆరోగ్య కేంద్రం, శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రం, మడకశిర ఏరియా ఆసుపత్రిలలో కొత్తగా డయాలసిస్ సేవల్ని అందించనున్నారు.

**ఒక్కో కేంద్రంలో 5 డయాలసిస్ మెషీన్లు:** కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్రతి కేంద్రంలో సుమారు రూ.85 లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోనికి వస్తాయి. వీటి ద్వారా రోజుకు 15 డయాలసిస్ సెషన్లు నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో దీర్ఘకాలంగా డయాలసిస్ చేయించుకోవాల్సి న రోగులకు సమీప ప్రాంతాల్లోనే చికిత్స పొందే సదుపాయం కలుగుతుంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సి న అవసరం తగ్గడంతోపాటు, రోగులు, వారి కుటుంబాలపై ప్రయాణ భారం, ఇతర ఖర్చులు తగ్గుతాయి. ఈ కేంద్రాల ద్వారా అందే సేవలకు ఏడాదికి రూ.11 కోట్ల వరకు వ్యయమవుతుంది. ఇప్పటికే పిఎంఎన్‌డిపి ద్వారా నడుస్తోన్న 61 కేంద్రాల్లో 754 మెషీన్లు పనిచేస్తున్నాయి. 2024-25లో ఈ రెండు కేటగిరీల్లో కలిపి డయాలసిస్ సేవలకు గాను ప్రభుత్వం రూ.126.58 కోట్లు వెచ్చించింది. 202526 నాటికి ఈ మొత్తం రూ.197.88 కోట్లకు చేరింది. 202627లో ఇప్పటి వరకు అయిన వ్యయం రూ.90.09 కోట్లు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద ప్రభుత్వ రంగంలో 21, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో కలిపి 149 డయాలసిస్ కేంద్రాలున్నాయి.

### ఆమ్రపాలి క్యాడర్ వివాదం

# తెలంగాణ హైకోర్టులో తీర్పు రిజర్వ్

**హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఎపికి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అన్నపూర్ణాదేవిగా బెజవాడ దుర్గమ్మ



**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13, ప్రభాతవార్త:** సకల లోకాల ఆకలి దప్పికలను తీర్చడమే కాక వారికి జ్ఞానవైరాగ్య మోక్ష సంపదలనొసగే శ్రీ అన్నపూర్ణాదేవిగా బెజవాడ దుర్గమ్మ భక్తులను అనుగ్రహించారు. దసరా ఉత్సవాల్లో 3వ రోజు మంగళవారం దుర్గమ్మవారు అన్నపూర్ణాదేవిగా అన్నప్రసాదాన్ని సాక్షాత్తూ కైలాసవాసి పరమశివునికి వడ్డిస్తూన్న అమ్మవారిని దర్శించుకుంటే అన్నపానాదులకు లోటు లేకుండా జీవించి జ్ఞాన భిక్షతో మోక్షపదాన్ని అందుకుంటారని వేదవిహితం. అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం వండేవారు వడ్డించేవారు స్వీకరిస్తున్న వారు కూడా పరబ్రహ్మ స్వరూపమే అని శ్రీ అన్నపూర్ణాదేవి తన అవతార విశేషాన్ని భక్తులకు చాటడం విశేషం.

**భక్తుల సందడి:** అన్నపూర్ణాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనానికి పెద్ద ఎత్తున తరలి వస్తున్న భక్తులుదసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతోవారికి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు, పోలీసు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జనసేన బంపర్ ఆఫర్

**● స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుంటే దరఖాస్తు చేసుకోండి**

**● ఏ పదవికి? ఎక్కడ నుంచి అన్నది వెబ్‌సైట్‌లో పెట్టండి: పవన్**



**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహులకు ఓపెన్ ఆఫర్ ఇస్తూ అధికారిక ప్రకటన వెలువడింది. మేయర్, కార్పొరేటర్, ఎంపిటిసి, జడ్‌పిటిసి, సర్పంచ్ తదితర పదవులకు పోటీ చేయాలనుకునే వారు పార్టీ అధికారికంగా ఏర్పాటు చేసిన రాజకీయ విభాగ మెయిల్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పవన్ కల్యాణ్ అవకాశం ఇచ్చారు. పవన్ కల్యాణ్ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల సన్నాహకాలకు పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నారు. 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక అడ్‌హాక్ కోఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి సమాచారం సేకరించి, స్థానిక సమస్యలు, పార్టీ బలం, ఆశావహుల నేపథ్యం తెలుసుకుని నివేదికలు సమర్పించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారం, కూటమి సమన్వయం, ట్రెజరీ వంటి కేంద్ర కమిటీలను కూడా నియమించారు. కూటమి భాగస్వామ్యంలో జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని పవన్ కల్యాణ్ ఇటీవల స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో జనసైనికులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, స్థానిక సంస్థల్లో కూడా సరైన భాగస్వామ్యం ఉండాలని అన్నారు. పార్టీ ఇప్పుడు కేవలం సీట్ల పంపకం కాకుండా, ప్రజలకు దగ్గరగా ఉండి సమస్యలు పరిష్కరించగల అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఓపెన్ ఆఫర్ ద్వారా జనసేన క్షేత్రస్థాయిలో కొత్త శక్తిని చేర్చుకోవాలని భావిస్తోంది. గతంలో ఎన్నికల్లో పోటీ చేసినవారు, పార్టీ కార్యకర్తలు, సామాజిక సేవ చేస్తున్నవారు, యువ నాయకులు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు సమర్పించిన తర్వాత స్థానిక కమిటీలు, కేంద్ర నాయకత్వం స్థాయిలో పరిశీలన జరుగుతుంది. చివరి నిర్ణయం మాత్రం పవన్ కల్యాణ్‌దే తుది నిర్ణయంగా ఉంటుంది. అయితే పోటీ చేయాలనుకునే వారికి దరఖాస్తుల నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది ఎంపికపై జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా నిర్ణయం తీసుకుంటారని పార్టీ స్పష్టం చేసింది. ప్రజాసేవకు సిద్ధంగా ఉన్న యువకులు, మహిళలు, అనుభవజ్ఞులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్టీ పిలుపునిచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్న వేళ జనసేన ఈ అవకాశాన్ని పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ప్రజాసేవకు నిజంగా సిద్ధంగా ఉన్నవారు ఈ ఆహ్వానాన్ని స్వీకరించి ముందుకు రావాలని పార్టీ కోరుతోంది. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు వెంటనే అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు సమర్పించవచ్చు.

# ఉత్సవాల వైభవాన్ని భావితరాలకు అందించడమే లక్ష్యం

**● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ● కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలకు హాజరు ● అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రామ్మోహన్, అచ్చెన్నాయుడు**

**శ్రీకాకుళం, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఉత్సవాలే మన ఆచార సంప్రదాయాలకు మూలమని, వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక వైభవాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అదే ఘనతతో అందించాల్సి న బాధ్యతను ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల్లో మంగళవారం ఆయన తన కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద ఆశీర్వచనాలను స్వీకరించారు. జాతర ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొత్తమ్మతల్లి తమ కుటుంబానికి ఆరాధ్య దైవమని, ఉత్తరాంధ్ర ఇలవేల్పు అయిన అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర పండుగ హోదాలో ఈ ఏడాది కూడా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. తన తండ్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు కాలం నుంచి తమ కుటుంబం అమ్మవారి ఆశీస్సులను పొందుతోందని, మంత్రి అచ్చెన్నాయుడు రాజకీయ ప్రస్థానంతో పాటు తన ఎదుగుదలలోనూ కొత్తమ్మతల్లి ఆశీస్సులు ముఖ్యమైన పాత్ర పోషించాయని తెలిపారు.

**కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ:** కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రతి ఏడాది జాతర మహోత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు, ప్రస్తుతం రూ.5 కోట్లతో ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత విస్తరించి, దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని చెప్పారు. సంప్రదాయానికి

**ఉత్సవాలకు కొత్త శోభ:** సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యమిస్తూనే ఆధునిక సాంకేతికతను జోడించి జాతర మహోత్సవాలను మరింత ఆకర్షణీయంగా నిర్వహించడం ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈసారి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడ్‌తో పాటు డ్రోన్ షోను ఏర్పాటు చేయడం ద్వారా భక్తులకు, సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందిస్తున్నామని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుకుంటూ, వాటిని భవిష్యత్తు తరాలకు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కోటబొమ్మాళి కొత్తమ్మతల్లికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

# చిన్నారుల కుటుంబాలకు పరిహారం అందచేత



**గన్నవరం రూరల్ (కృష్ణా), అక్టోబరు 13 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రత్యేక చొరవచూపి ప్రభుత్వం నుండి పరిహారం మంజూరు చేయించారు. వివరాల్లోకి వెళితే కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలో ఈఏడాది మార్చి 3న చెరువులో స్నానానికి దిగిన దుప్పుల విజయ్‌కుమార్(14), బిళ ్ళ మోహన్‌సాయి(15), ముచ్చ జోసెఫ్(15)లు చెరువులోని క్వారీగుంతల్లో పడి మృతిచెందారు. వీరంతా పేదలు కావటంతో వీరికి ఇళ్ళపట్టాలు మంజూరు చేయించారు. మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ ముఖ్యమ ంత్రి చంద్రబాబుని కలిసి విజ్ఞప్తిచేయటంతోపాటు అనంతరం సంబందిత అధికారులతో మాట్లాడి ఆర్థికసాయం మంజూరు అయ్యేందుకు కృషిచేసారు. ఈమేరకు ఒక్కోకుటుంబానికి రూ.2లక్షలు చొప్పున ఆర్థికసాయం మంజూరయ్యింది. మంగళవారం మృతుల ఇళ్ళకు వెళ్ళిన యార్లగడ్డ మృతుల తల్లిదండ్రులకు ఆర్థికసాయం చెక్కులు అందచేసారు. ఏసాయం కావాలన్నా నేరుగా తనవద్దకు రావాలని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్రరైతుమోరా ్చ అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

14-10pg4.qxd:14-10pg4.qxd 1/1/02 8:21 AM Page 1



వార్త

మానవ మేధ స్వేచ్ఛగా ఉన్నప్పుడే సమాజ సంక్షేమానికి నిజమైన భద్రత లభిస్తుంది.

న- లాస్కీ

# క్షయ ముక్తభారత్‌దే పైచేయి?

ఈ దేశంలో అంటు, సొంటు లేని వ్యాధులేవన్నా ఉన్నాయంటే వాటిని వేళ్లమీద లెక్కించుకోవాల్సిందే. అనాదిగా అంటువ్యాధిగా తారసపడ్తున్న వ్యాధి ఏదైనా ఉంటే అది 'క్షయ' వ్యాధి. ఈ మధ్యనే 'ప్లేగ్' వ్యాధి కూడా తిరుగుటపాలో వచ్చేసిందన్న వార్తలు వచ్చేసాయి. ఒకప్పుడు ఈ వ్యాధులు సోకి భారతీయుల ప్రాణాలను కబళించేసాయనే చరిత్ర ఉంది. అందుకే క్షయ వ్యాధి మళ్లీ ప్రబలుతోందంటే భారతీయులు తమ శ్వాసకోశ రక్షణకు ఎంతో ఆందోళన చెందుతున్నారు. టి.బి అత్యంత ప్రమాదకరం. ప్రాణాంతక వ్యాధిగా భయంతో చెప్పుకునే వ్యాధి. దేశీయుల ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను శతాబ్దాలుగా వేధిస్తున్న వ్యాధుల్లో ఒకటిగా క్షయవ్యాధినే చెబుతుంటాము. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ప్రపంచదేశాలు 2030 నాటికి క్షయ వ్యాధిని తరిమి కొట్టాలన్నది ప్రధానంగా గోచరిస్తుంది. కాగా భారత్ మాత్రం ఈ లక్ష్యసాధనలో ముందడుగు వేసే దిశగా పరుగులుతీస్తోంది. ఇప్పుడు 'ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ అనే ఆలోచనను ఒక ప్రత్యేక ఆరోగ్య పథకంగా చేపట్టింది. కేవలం ఆసుపత్రుల ద్వారా రోగులకు మందులు చేయడమొక్కటే ఈ వ్యాధి నయానికి సరిపోదని ఎంచి ప్రత్యేకించి దీన్నొక సామాజిక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ధ్యేయంతో ఉంది. ముందుగా ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని భావించింది. కార్పొరేట్ సంస్థలు, ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులు 'ని-క్షయ మిత్ర'గా నమోదు చేసుకొని, టిబి రోగులను కూడా దత్తత తీసుకుంటారు. అనగా వారికి వైద్యసేవలు, చికిత్సలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారిని జతచేస్తారు. ఇవిగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆధ్వర్యంలో నేషనల్ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రాం కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం శ్రద్ధాసక్తులతో క్షయనివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అయినా సత్ఫలితాలు పొందే విషయంలో పూర్తిస్థాయి విశ్లేషణలు జరిపినప్పుడు మన ప్రభుత్వాల వైఖరి భిన్నంగా అనిపిస్తోంది. ట్యుబర్క్యులోసిస్ వ్యాధి విషయమే చెప్పాలంటే 2010లో అత్యధికంగా ఈ వ్యాధులు భారత్‌లోనే 26 శాతం ఉన్నాయని అంచనా వేసారు. ప్రపంచం మొత్తం మీద ఐదు దేశాల్లో క్షయవ్యాధిగ్రస్తులు 55.9 శాతం ఉన్నారని గ్లోబల్ టిబి రిపోర్ట్ తెలియచేస్తోంది. దేశంలో 2010లో క్షయరోగానికి యేటా 5.8 లక్షలమంది బలవుతున్నారు. కాగా 2023లో 3.2 లక్షలకు మరణాలు తగ్గాయి. 2015-24లమధ్య భారత్‌లో 3.05 లక్షల మంది మరణించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడిస్తోంది. అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే క్షయవ్యాధి తగ్గుదలను సూచిస్తోంది. క్షయవ్యాధి నివారణకు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పూర్తిస్థాయి తగ్గించడం అసాధ్యంగా అనిపిస్తోంది. ప్రధానంగా పొగాకు ఉత్పత్తులతో చుట్టా, బిడీ, సిగార్ వంటివి వాడడం వల్ల శరీరం కుళ్లిపోతోంది. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ, సమగ్ర సర్వేల ద్వారా క్షయ రోగగ్రస్తులను గుర్తించడమవుతోంది. మామూలు మందులుకు లొంగని మల్టిడ్రగ్ రెసిస్టెంట్ టిబిని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కావడం లేదు. ఈ వ్యాధిగ్రస్తులు ఔషధాలను తీసుకోవడం మధ్యలోనే ఆపివేయడం వలనో టిబి నిరోధకత కష్టమవుతోంది. పోషకాహార లోపం, నివాస రద్దీ వంటి అంశాల వలన గ్రామీణులకు ముప్పుగా పరిణమిస్తోంది. శ్రామిక వర్గాల్లో అవగాహనలేమి వల్ల మరికొంత మందిలో రోగ లక్షణాలు బయటపడుతున్నాయి. శరీరం మీద వేగవంతమయిన కొత్త వ్యాక్సిన్‌లతో తక్కువ వ్యవధిలోనే నయమయ్యే విధంగా ఔషధాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. టిబి ముక్త్ పంచాయతీల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచే అనుమానిత రోగుల్ని గుర్తించి చికిత్సలను వారికి దగ్గర చేయాలి. కాగా కేంద్రప్రభుత్వం కోవిడ్ మహమ్మారి సోకిన సమయంలో అధిక నిధులు అటు మళ్లించడంతో 'టిబి' వ్యాధి నిరోధకత పట్ల శ్రద్ధ తగ్గించింది. నిధులు కూడా సరిపడినన్ని కేటాయించకపోవడంతో క్షయవ్యాధి రోగులు పెరిగారని అంచనాలు వివరిస్తున్నాయి. 2023లో అంతకు ముందు కన్నా 38 శాతం నిధులు ఎక్కువగా కేటాయించినందున క్షయముక్త భారత్ ఊపందుకుంది. టిబి వ్యాధి సోకిన రోగులకు దూరంగా ఉండడం రోగులను గుర్తించిన వెంటనే వారికి సరైన చికిత్సలను అందించే కార్యాచరణకు ఉపక్రమించడం అవసరం. వ్యాధిగ్రస్తులకు సామాన్య ప్రజానీకం దూరంగా ఉండాలి. వారు దగ్గినా, తుమ్మినా వారికి సమీపంలో ఉన్నవారికి ఈ వ్యాధిసోకే అవకాశముంది. ఇటీవలే పొగ తాగే వారికన్నా వారి నుంచి వచ్చే పొగ పీల్చేవారికే శ్వాసకోశ వ్యాధులు రాగలవని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు కూడా వెలువడ్డాయి. కనుక క్షయ కూడాశ్వాసకోశాన్ని మాలిన్యపరిచే వ్యాధి కనుక మానవాళి స్వయంగా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇతర దేశాల కన్నా భారత్‌లో టిబి రోగుల నిష్పత్తి అధికంగా ఉన్నందున భారత్‌లో మరికొన్ని చికిత్సలు కూడా అవసరమయున్నది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 10.8 మిలియన్ల కేసులున్నాయన్న సర్వేలు చెబుతుండగా ఆగ్నేయాసియాలోనే వీటి వ్యాప్తి ఎక్కువగా ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వ వైద్యచికిత్సా పథకాలను ప్రతి ఒక క్షయరోగి పొందాల్సి ఉంది. ఇండియాలో 2024లో టిబి కొత్త కేసుల అంచనా ప్రకారం లక్ష జనాభాకు 237 నుంచి 187కి తగ్గింది. 2015తో పోలిస్తే 21 శాతం తగ్గినట్లే. 2015 నుండి 2024ల మధ్య 27 లక్షలు కొత్త కేసులు నమోదయ్యాయి. ఒకవైపు వ్యాధి నియంత్రణలో పురోగతి కనపడుతున్నా కొత్తగా పలువురకు క్షయవ్యాధి సోకటం ఆందోళనకరం. వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ప్రధానంగా ఈ పథకం లక్ష్యశుద్ధితో అమలు కావాల్సి ఉంది. ఈ వ్యాధిని దాచుకోవాలని ఎవరైనా చూస్తే అది వారికే శాపంగా పరిణమించగలదు.

అతిగా జాగ్రత్త పడడం దౌర్భాగ్యుని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.



సెసిల్

ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.



స్వామి వివేకానంద

# జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇస్తేనే మేలు!

ప్రజల చేత ఎన్నుకోబడ్డ జె అండ్ కె రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో ప్రజల సమస్యలు తీర్చటానికి చర్చలు జరపటానికి, దేశంలోని సమైక్యతను ప్రతిబింబించటానికి, కాశ్మీర్ సమస్యను సమూలంగా పరిష్కరించటానికి క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు పడ్డట్లు అవుతుంది! ప్రధాని మోడీ నాయకత్వంలో ఎన్.డి.యే కూటమి ప్రభుత్వం అన్నిరంగాల్లో అవధుల మేర విజయాలను సాధిస్తున్నది. అందుకనే అ ప్రతిహతంగా ఎన్నికలల్లో విజయ ఢంకా మ్రోగిస్తున్నది. కాశ్మీరు సమస్య జాతిని దేశాన్ని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పట్టి పీడిస్తున్న సమస్యగా మారింది. నేడు కాశ్మీరు ప్రజలు భారతదేశం వెంట వున్నట్లు 2024 ఎన్నికల ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోటానికి ప్రధాని హామీ మేర రాష్ట్రహోదాను తిరిగి దఖలు చేస్తే పాకిస్థాన్ వెనకడుగు వేయక తప్పదు. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరు కూడా మన దేశంలో అంతర్భాగంగా మారే రోజు దగ్గరవుతుంది!



రావులపాటి సీతారాంరావు

అనుకోని రీతిలో కేంద్ర ప్రభుత్వానికి చాలా సమస్యలు ఎదురు అవుతున్నాయి. కాంగ్రెస్ జనతా పార్టీ పంజా విప్పి జంతర్ మంతర్ ఈసారి 'సర్' చీఫ్ జ్ఞానేశ్ కుమార్‌ను వేటేయాలని చూస్తున్నది! అంతర్జాతీయంగా భారత్‌ను మరింతగా ఇబ్బందులలో నెట్టే సమీకరణలు లేవుకానీ, ప్రస్తుత పరిణామాలు దేశంలో అంత సౌకర్యంగా లేవని మాత్రంచెప్పొచ్చు! ఎన్.డి.ఏ కూటమిని దీటుగా ఎదుర్కొనేందుకు ఇండియా కూటమి, రాహుల్ గాంధీ నేతృత్వంలో చిన్నాచితకా పార్టీలను కూడగట్టి విశ్వ ప్రయత్నాలు పార్లమెంటులో, బయటా చేస్తున్నది కానీ ఫలితాలు వారి టాగ్ లైన్‌కు (భారత్ జీతేగా)తగ్గట్టుగా రావటం లేదు! అయినా సరే 'సర్' చీఫ్ పదవి వదిలేయాలని దేశమంతటా ఆ ఎలయన్స్ పార్టీలు రోడ్లు ఎక్కుతునే వున్నాయి! ఢిల్లీలో సరేసరి! ఇలాంటి పరిస్థితులల్లో దాదాపు పదేళ్ల తర్వాత ఇల్లు చక్కదిద్దుకోవాల్సిన అవసరం బలమైన నాయకుడు ప్రధాని మోడీకి వచ్చింది! జమ్మూ కాశ్మీర్‌కు (తిరిగి రాష్ట్ర హోదా)స్టేట్ హోదా ఇవ్వాలని జెఅండ్ కెలోని నాయకులుమరో సమస్యను తెచ్చిపెట్టే పరిస్థితులు కనపడుతున్నాయి! సెప్టెం బర్ 28న జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ తమ రాష్ట్రానికి స్టేట్ హుడ్ పునరుద్ధరించాలని ఒక ప్రతిపాదన ఆమోదించటమే కాకుండా డిమాండ్ రూపంలో కేంద్రానికి పంపటంతో మరోజటిలమైన సమస్యను ఎన్.డి.ఏప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తున్నది! రాజకీయాలు కాచి వడపోసిన నాయకులు, మీడియా ఆసక్తిగా ఈ పరిణామాన్ని గమనిస్తున్నారు. ఈ సమస్యను తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి! యూనియన్ టెరిటరీగా జమ్మూకాశ్మీరుకు ఏడు సంవత్సరాలు నిండాయి! ఇంతకు మునుపు వున్న జె అండ్ కె రాష్ట్రాన్ని యూనియన్ టెరిటరీగా రెండు భాగాలుగా విభజించి 70 సంవత్సరాల ప్రత్యేక రాజ్యాంగ హోదాను 2019లో తగ్గించి యు.టిగా చేయటం జరిగింది. కేంద్రం మూడు అడుగులు వేయటం ద్వారా రాష్ట్రహోదాను పునరుద్ధరించటం జరుగుతుందని చెప్పింది. డీలిమిటేషన్, ఎన్నికలు, రాష్ట్ర హోదా ఆ అంచెలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ఆమోదించిన ప్రతిపాదనకు ఎలయన్స్ బంధం వున్న రెండు రూలింగ్ పార్టీలు, (జె.కె. యన్.సి ఐ.ఎన్.సి) సి.పి.యం., స్వతంత్రులు ప్రతిపక్ష పార్టీలుగా వున్నపీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ, జెకె పీపుల్స్ కాన్ఫెన్స్, ఆమ్‌ఆద్మీ, అవామీ ఇత్తెహాద్ పార్టీలు సపోర్టు చేసాయి. మొత్తం సభలో వున్న 90మంది సభ్యుల్లో బిజెపికి చెందిన 29మంది వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు కూడా అతి త్వరలో స్టేట్ హుడ్ను పునరుద్ధరించాలని అభిప్రాయపడింది. ప్రధాని మోడీ కూడా సరియైన సమయంలో ఇది జరుగుతుందని హామీకూడా యిచ్చారు. అయితే ప్రజాస్వామ్యాన్ని గట్టిగా బలపర్చేవారు కేంద్రం తిరిగి రాష్ట్ర హోదాను పునరుద్ధరించటంలో ఆలస్యం చేస్తున్నదని భావిస్తున్నారు. కేంద్రం స్టేట్ హుడ్ను తీసివేయకుండా వుండాల్సిందని, ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలా జరగలేదని ప్రజాస్వామ్య యుతంగా పాలిస్తున్న కేంద్రం ఈ చర్యను తలపెట్టకుండా వుంటే బాగుండేదని కూడా అభిప్రాయపడుతున్నారు! నిజానికి 2024 ఎన్నికలు జె అండ్ కెలో చాలా ప్రశాంతంగా జరిగాయి. అంతకు మునుపు వున్న హింసాకాండ, తీవ్రవాదుల దాడులు, కాశ్మీర్ అంటేనే భగభగ మండే అగ్ని గుండంగా భావించిన రోజుల్నుంచి, ఎలక్షన్లు బాయ్కాట్ చేయాలన్న ఒత్తిడులు తట్టుకొని జెకె ప్రజలు ఎన్నడూ లేని రీతిలో ఓటింగ్ రేట్‌ను (63.88)గణనీయంగా పెంచి, ఒక్కబుల్లెట్ కూడా ప్రయోగించటానికి ఆస్కారం ఇవ్వకుండా మా భవిష్యత్తు భారత్ అంతర్భాగంగానే ముడిపడి వుందన్న సంకేతంతో ఎన్నికలలో అసాధారణ రీతిలో విజయాన్ని ప్రజాభిప్రాయాన్ని నమోదుచేసారు. అలాంటి పరిస్థితులలో ప్రధాని హామీప్రకారం స్టేట్ హుడ్ను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా వుంది! ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా భారత్‌తోనే వారి పార్టీ భవిష్యత్తు ముడిపడి వుందని నికార్సుగా నమ్ముతున్న వారిలోముందరి వరుసలో వుంటారు! పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరులో కానీ, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్, బెలూచిస్థాన్‌ల ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే, మన దేశం ఎంత జాగ్రత్తగా ఎన్ని పొరపాట్లు జరిగినప్పటికిని ప్రజాస్వామ్యాన్ని కంటిరెప్పలా కాపాడుకుంటున్నదో అందరికీ అద్దంలో చూపినట్లు కనపడుతున్నది! నిన్నటి యుద్ధాలలో కూడా సమ్యక్ దృక్పథాన్ని గ్లోబల్గా ప్రదర్శించి, మన దేశ విలువలను పెంచిన నాయకుడిగా ప్రధాని మోడీ అసాధారణ గుర్తింపు తెచ్చుకున్న ఈ తరుణంలో, జె అండ్ కెకు స్టేట్ హుడ్ తిరిగి ఇవ్వటం లాంటి చర్యలు మన దేశ ప్రతిష్టను మరింతగా పెంచుతాయనటంలో సందేహం లేదు! అవకాశందొరికినప్పుడల్లా పాకిస్థాన్ మిలిటెంట్ల దాడులను మన ప్రాంతాలలో చేస్తునే వుంది! 'సిందూర్' ఆయుధ ప్రయోగంతోఇప్పుడు అలాంటి సాహసాలకు తలపడటం లేదు! చైనా కూడా పాకిస్థాన్‌ను తన అవసరం మేర వాడుకున్నది కానీ ఇదివరకటిలా పాకిస్థాన్ కయ్యానికి దిగగానే, చైనా భారత్‌పై కాలు దువ్వటం లేదు. రష్యా, యుయస్, ఇజ్రాయిల్, పశ్చిమాసియా దేశాలు అంతర్యుద్ధాలతో తల మునకలై వున్నాయి. యుయన్‌ఒ సమావేశాల్లో భారత విదేశాంగ నిపుణులు మా దేశం జోలికివస్తే ఊరుకొనేది లేదు కానీ మా అంతటమేము ఏ దేశంతో అనవసరంగా తలపడేది లేదు అని నిర్ద్వందంగా ప్రకటించటం భారత్ బలపడిన స్థానం నుంచి వాస్తవాన్ని చెప్పినట్లుగా అంతర్జాతీయ నిపుణులు గుర్తిస్తూనే వున్నారు. 2024 ఎన్నికలలో కాశ్మీర్ ప్రజలు ప్రదర్శించిన విజ్ఞత, స్పష్టమైన సంకేతాల దృష్ట్యా కేంద్రం, ఆ ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రజాస్వామ్య విలువలకు, ఇచ్చిన హామీకి గౌరవాన్ని ఇస్తూ జె అండ్ కెకు రాష్ట్ర హోదాను తిరిగి ఇవ్వటం మేలు! గత కాలంలో కాశ్మీరు ప్రజలు అనుభవించిన కష్టాలు, ఈ పునరుద్ధరణతో మరిచిపోవటమే కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతులు హామీలు అమలు చేయటంలో ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించకుండా వుండలేరు! అదీ గాకుండా కోర్టు తీర్పును అమలు చేయటానికి త్వరత్వరగా అడుగులు వేస్తున్న సంకేతం కూడా ఇచ్చినట్లవుతుంది! అసెంబ్లీ ఎన్నికలలో, ప్రశాంత వాతావరణం కల్పించి ఓటువేసిన ప్రజలకు ఎంతో ఊరట ఈ చర్యద్వారా కేంద్రం కలిగించినట్లవుతుంది! ప్రజల చేత ఎన్నుకోబడ్డ జె అండ్ కె రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో ప్రజల సమస్యలు తీర్చటానికి చర్చలు జరపటానికి, దేశంలోని సమైక్యతను ప్రతిబింబించటానికి, కాశ్మీర్ సమస్యను సమూలంగా పరిష్కరించటానికి క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు పడ్డట్లు అవుతుంది! ప్రధాని మోడీ నాయకత్వంలో ఎన్.డి.యే కూటమి ప్రభుత్వం అన్నిరంగాల్లో అవధుల మేర విజయాలను సాధిస్తున్నది. అందుకనే అ ప్రతిహతంగా ఎన్నికలల్లో విజయఢంకా మ్రోగిస్తున్నది. కాశ్మీరు సమస్యజాతినిదేశాన్ని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పట్టి పీడిస్తున్న సమస్యగా మారింది. నేడు కాశ్మీరు ప్రజలు భారతదేశం వెంటవున్నట్లు 2024 ఎన్నికల ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోటానికి ప్రధాని హామీ మేర రాష్ట్రహోదాను తిరిగి దఖలు చేస్తే పాకిస్థాన్ వెనకడుగు వేయక తప్పదు. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరు కూడా మన దేశంలో అంతర్భాగంగా మారే రోజు దగ్గరవుతుంది!



# హిమాలయాల భద్రతే భవిష్యత్తుకు భరోసా

సి.హెచ్. ప్రతాప్

హిమాలయాల్లో కరుగుతున్నది మంచు మాత్రమేకాదు, కోట్లాది ప్రజల నీటి భద్రతకు భరోసా కూడా. జీవనదులకు జన్మనిచ్చే హిమానీనదాలు, అపార జీవవైవిధ్యానికి నిలయమైన పర్వతాలు ఇప్పుడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కుంభవృష్టి, కొండచరియల పతనంతో అస్థిరమవుతున్నాయి. వరుస విపత్తులు అక్కడి అభివృద్ధి విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని చాటుతున్నాయి. ప్రకృతి హెచ్చరికలను గుర్తించి స్పందించడమే భవిష్యత్తుకు భరోసా. ఈ ఏడాది ఆగస్టు 26న నేపాల్ లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతంపై మంచు, శిలలు కూలిపోవడంతో సంభవించిన వరదలు నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. గ్రామాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. అక్టోబర్ నాటికి 1,457 మంది మరణించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రాణాలతో బయటపడిన కుటుంబాలు ఇళ్లతోపాటు జీవనాధారాలను కోల్పోయాయి. ఆయా ప్రాంతాల్లో పునరావాసం, మౌలిక సదుపాయాల పున రుద్ధరణ పెనుసవాళ్లుగా మారాయి. ఆ విషాదం నుంచి కోలుకోకముందే అక్టోబర్ 11న నేపాల్‌లోని బుఢీ గండకీ నది పరివాహక ప్రాంతాన్ని మరో ఆకస్మిక వరద ముంచెత్తింది. కొండచరియలతో నదికి ఏర్పడిన తాత్కాలిక అడ్డు కట్ట తెగిపోవడం ఇందుకు కారణమై ఉండవచ్చని నిపుణుల ప్రాథమిక అంచనా. ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ ప్రాంతాలు దెబ్బతిన్నాయి. ఐదుగురు గల్లంతవగా, వందమందికిపైగా విదేశీ యాత్రి కులు చిక్కుకుపోయారు. సకాలంలో అందిన హెచ్చరికలు పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తోడ్పడ్డాయి. భారత హిమాలయాల్లోనూ ఇటీవలి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2025 ఆగస్టు 5న ఉత్తరా ఖండ్‌లోని ధరాలీ-హర్షిల్ ప్రాంతాల్లో బురద, రాళ్లతో దూసుకొచ్చిన ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. అదే నెల 14న జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లా చిసోతిలో కుంభవృష్టి ప్రాణనష్టం కలిగించింది. ఆగస్టు 22-23 రాత్రి చమోలీ జిల్లా థరాలీలో వరదలు, కొండచరియలు జనజీవనాన్ని దెబ్బతీశాయి. తెగిపోయిన రవాణా మార్గాలు సహాయక చర్యలకు ఆటంకమయ్యాయి. పర్యాటకంపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. ఈ విపత్తులన్నింటికీ ఒకే కారణం లేదు. ప్రతి ఘటననూ హిమానీనదాల కరుగుదలకే ఆపాదించడం సరికాదు. అయితే పెరుగుతున్న వేడి మంచును, శాశ్వతంగా గడ్డ కట్టిన నేలను అస్థిరపరుస్తోంది. ఐసీఐఎంఓడీ మార్చి 2026 నివేదిక ప్రకారం, హిందూకుష్-హిమాలయ ప్రాం తంలో మంచు నష్టం రేటు 2000 తర్వాత రెట్టింపైంది. 1990-2020 మధ్య హిమానీనదాల విస్తీర్ణం సుమారు 12 శాతం తగ్గింది. ఈ పర్వత వ్యవస్థ దిగువ ప్రాంతాల్లో దాదాపు రెండువందల కోట్లమంది నీటి అవసరాలకు కీలక మైన ఆధారం. ప్రమాదం పర్వత గ్రామాలకే పరిమితం కాదు. వరదలు పంటలను నాశనం చేస్తాయి. రహదారులు ధ్వంసమైతే సరకు రవాణా నిలిచిపోతుంది. మంచునిల్వలు తగ్గితే దీర్ఘకాలంలో నదుల కాలానుగుణ ప్రవాహాలు మారి సాగునీరు, తాగునీరు, విద్యుదుత్పత్తిపై ఒత్తిడి పెరుగుతుంది. పర్వత జీవవైవిధ్యం, స్థానిక సమాజాల జీవన విధానం దెబ్బతింటాయి. ఒక ప్రాంతంలోని విపత్తు దిగువనున్న పట్టణాలు, వ్యవసాయ ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుంది. అందుకే నిర్మాణాలకు ముందు భూగర్భ స్థిరత్వం, వరద ముప్పు, పర్యావరణం భరించగల పరిమితులను పరిశీలించాలి. ప్రమాదప్రాంతాల్లో నిర్మాణాలనునియంత్రించి, అవసరమైన కుటుంబాలకు గౌరవప్రదమైన పునరావాసం కల్పించాలి. నదీ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడాలి. రహదారుల నిర్మాణంలో తొలగించిన మట్టి, రాళ్లను ప్రవాహాల్లో పడేయకుండా చూడాలి. పర్యాటక కార్యకలాపాలు స్థానిక సామర్థ్యానికి అనుగుణంగా సాగాలి. అడవుల పరిరక్షణ, సహజ జలమార్గాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముందస్తు హెచ్చరిక ప్రతి గ్రామానికీ చేరాలి. సరిహద్దు దేశాలు వరద సమాచారాన్ని హిమాల

# ఆహార వృథాను నివారిస్తేనే సమాజ ప్రగతి

వై. సంజీవ కుమార్

ఆహారం అనేది కేవలం ఆకలిని తీర్చే పదార్థం మాత్రమే కాదు. అది మనిషి జీవనానికి ఆధారం, ఆరోగ్యానికి పునాది, శరీరానికి శక్తి, కుటుంబానికి భరోసా, సమాజానికి బాధ్యతను గుర్తుచేసే ఒక గొప్ప జీవన సత్యం. మనిషి సంపాదించే సంపద ఎంత ఉన్నా, ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా, ఆకలి వేసినప్పుడు అవసరమయ్యేది ఒక్క ముద్ద అన్నమే. అందుకే ఆహారం విలువను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, ఆకలితో బాధపడుతున్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఆకలిని నిర్మూలించడం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, ఆహార భద్రతను సాధించడం, ప్రతి ఒక్కరికీ సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందేలా కృషి చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు. నేడు మనిషి ఆహారపు అలవాట్లను, సమాజంలో ఆకలి పరిస్థితులను, మనిషి బాధ్యతలను ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన రోజు. చాలామందికి ప్రతిరోజూ మూడు పూటలా ఆహారం లభించడం సహజమైన విషయంగా అనిపిస్తుంది. ఇంట్లో వండిన భోజనం, హోటళ్లలో లభించే వంటకాలు, వేడుకల్లోవడ్డించే విందులు మన జీవితంలో సాధారణ దృశ్యాలుగా మారిపోయాయి. అయితే అదే సమయంలో ఒక పూట భోజనం కోసం ఎదురుచూసే కుటుంబాలు, రాత్రి ఆకలితోనిద్రపోయే పిల్లలు, వృద్ధాప్యంలో ఆదరించే వారు లేక ఆహారం కోసం ఇతరులపై ఆధారపడే వృద్ధులు కూడా నేటి సమాజంలో ఉన్నారు. ప్లేట్లలో మిగిలిపోయే అన్నం మరొకరి ఆకలిని తీర్చగలదనే ఆలోచన మనలో ఎంతమందికి వస్తుంది? మనం తినకుండా పారవేసే ఆహారం వెనుక రైతు శ్రమ, భూమి, నీరు, విద్యుత్తు, విత్తనాలు, రవాణా, వంట చేసిన వారి కష్టం దాగి ఉన్నాయి. ఒక గింజ అన్నం మన చేతికి చేరే వరకు ఎన్నో దశల్లో ఎంతోమంది శ్రమిస్తారు. కాబట్టి ఆహారాన్ని గౌరవించడం అంటే రైతును గౌరవించడం, ప్రకృతిని గౌరవించడం, మానవ శ్రమకు విలువ ఇవ్వడం. ఆకలి విలువను నిజంగా అర్థం చేసుకోవాలంటే ఆకలితో ఉన్న వ్యక్తి పరిస్థితిని మనసుతో ఊహించుకోవాలి. కడుపు నిండిన వ్యక్తికి ఆహారం ఒక ఎంపిక కావచ్చు. ఆకలితోఉన్న వ్యక్తికి అదే ఆహారం జీవనాధారం. అందుకే అన్నదానం అనేది కేవలం భోజనం పెట్టడం మాత్రమే కాదు, ఒక మనిషికి ఆ క్షణంలో జీవించే ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని అందించడం కూడా. ఒకవైపు వివాహాలు, శుభకార్యాలు, విందులు, హోటళ్లు, వేడుకల్లో అవసరానికి మించి ఆహారాన్ని సిద్ధంచేసి చివరకు పారవేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు పేదరికం, నిరుద్యోగం, నిరాశ్రయత్వం, కుటుంబ సమస్యలు, వృద్ధాప్య అసహాయతవంటి కారణాలతో కనీస భోజనం కూడా పొందలేని వారు ఉన్నారు. నగరాల్లోని రహదారుల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవించే నిరాశ్రయులు, అనాథ పిల్లలు, ఒంటరిగా మిగిలిపోయిన వృద్ధులు, సంచార జీవనం సాగించే కుటుంబాలు అనేక



ఇబ్బందులను ఎదుర్కొంటుంటారు. వారికి ప్రతిరోజూ ఆహారం ఎక్కడ లభిస్తుంది? తాగడానికి పరిశుభ్రమైన నీరు దొరుకుతుందా? అనారోగ్యంతో ఉన్నప్పుడు పోషకాహారం పొందగలుగుతున్నారా? అనే ప్రశ్నలు ఆలోచింపజేయాలి. ఆకలి అనేది కేవలం ఆర్థిక సమస్యమాత్రమే కాదు. అదిఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక సమానత్వంతో ముడిపడి ఉన్న సమస్య. సరైన ఆహారం అందకపోతే పిల్లల్లో ఎదుగుదల మందగించవచ్చు, చదువుపై ఏకాగ్రత తగ్గవచ్చు, పెద్దల్లో పని చేసే శక్తి తగ్గవచ్చు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు తీవ్రమవచ్చు. అందువల్ల ఆకలిని తగ్గించడం అంటే ఒక వ్యక్తి ప్రస్తుత అవసరాన్ని తీర్చడమే కాకుండా, అతని భవిష్యత్తుకు కూడా తోడ్పడటం. అయితే ఆకలితో ఉన్న ప్రతి వ్యక్తి పరిస్థితి ఒకేలా ఉండదు. కొందరికి తాత్కాలికంగా భోజనం అవసరమవుతుంది. మరికొందరికి నిరంతర ఆహార సహాయంతో పాటు ఉపాధి, నివాసం, వైద్యం, విద్య వంటి అవకాశాలు అవసరమవుతాయి. కాబట్టి తక్షణ సహాయంతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా దృష్టిపెట్టాలి. ఆహార కొరతను తగ్గించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మాత్రమే పనిచేస్తే సరిపోదు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి. అవసరానికి మించి వండటం, ప్లేట్లలో ఎక్కువగా వడ్డించుకోవడం, మిగిలిన ఆహారాన్ని నిర్లక్ష్యంగా పారవేయడం వంటి అలవాట్లను మార్చుకోవాలి. మీకు ఎంత ఆహారం అవసరమో అంతే తీసుకోవాలి. అవసరమైనంత మాత్రమే వండుకోవాలి. మిగి లిన సురక్షితమైన ఆహారాన్ని సరైనపద్ధతుల్లో నిల్వ చేయా లి. ఆహారాన్ని ఇతరులకు అందించాలనుకుంటే దానినాణ్యత, పరిశుభ్రత, నిల్వ సమయం వంటి అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలి. వివాహాలు, పుట్టినరోజులు, వార్షికోత్సవాలు, ఇతర వేడుకల్లో మిగిలే సురక్షితమైన ఆహారాన్ని బాధ్యతా యుతంగా అవసరమైన వారికి అందించే వ్యవస్థలనుప్రోత్సహించాలి. అన్నదానాన్ని అలవాటుగా మార్చుకోవాలి, సహాయం పొందుతున్న వారిని పేదవారిగా, అసహాయులుగా తక్కువ చేసి చూడకూడదు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడు తూ, వివక్ష లేకుండా, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి. మానవత్వం అందరిలో ఉండాలి. పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించాలి చిన్నప్పటినుంచే అన్నం వృథా చేయకూడదని, రైతుకష్టాన్ని గౌరవించాలని, అవసరమైన వారికి సహాయం చేయాలని నేర్పాలి. పాఠశాలల్లో ఆహారవిలువ, పోషకాహారం, పరిశుభ్రత, ఆహార వృథా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కడుపు నిండటం మాత్రమే సరిపోదు. సమతుల్యమైన, పోషకమైన ఆహారం కూడా అవసరం. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి వారి అవసరాలకు తగిన ఆహారం అందేలా శ్రద్ధచూపాలి. ప్రభుత్వ పథకాలను బలోపేతం చేయాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ పోషకాహార కార్యక్రమాలు వంటి సేవలు అర్హులైనవారికి సక్రమంగా అందేలా పర్యవేక్షించాలి. ఆకలితో ఉన్న కుటుంబాలకు ఆహార భద్రత తోపాటు ఉపాధి, విద్య, వైద్య సహాయం అందించాలి. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన

# ప్రజావాక్కు



## నిరసన గళంపై బలప్రయోగం

ఢిల్లీలో నిన్న ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో సహా వివిధ ప్రజాసంఘాలు, పార్టీలు తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం బలప్రయోగంతో అణిచివేసింది. ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రదేశంలోనే కాకుండా దేశవ్యాప్తంగా పలువుర్ని ముందుగానే అదుపులోకి తీసుకొని ధర్నాస్థలానికి చేరకుండా అడ్డుకుంది. వందలాది రైళ్లనిరద్దుచేసి, వేలాదిమందిని అదుపులోకితీసుకొని, ఢిల్లీలో డజను మెట్రో రైళ్లను, ఇంటర్నెట్ సేవల్ని నిలుపుదల చేసి నిరసన కార్యక్రమంపై విరుచుకుపడింది. అదుపులోకి తీసుకున్నవారిలో నలుగురుమాజీ ముఖ్యమంత్రులు కూడాఉన్నారు. తమ నిరసనకు కారణం తెలిపి, అనుమతి తీసుకున్నతర్వాత, శాంతి యుతంగానే నిర్వహిస్తామనిస్పష్టపరిచాక, ప్రభుత్వం ఇంతభారీ స్థాయిలో ధర్నాని విఫలం చెయ్యడం సబబు కాదు.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## వివక్షే జీవిత పాఠం

నోబెల్ శాంతి బహుమతి సాధించిన నవనీతము నవి పిల్లాయివిశిష్టతను ఆమె వెలువరించిన తీర్పులను చూస్తే ప్రపంచం ఆధిపత్యం అనే పునాదులపైన కాకుండా న్యాయం అనే పునాదుల పైన మాత్రమే ప్రయానించాలి అని చెప్పడం గొప్పమార్పు. అయితే ఆమె రువాండాలో ఉన్న బలహీనుల వైపు పాలస్తీనా ఆక్రమణ వైపు నిలబడి తీర్పులుఇచ్చి బలహీనులను బలవంతులుగా తీర్చిదిద్దడం వైపు తన అధికారాన్ని ఉపయోగించారు. ఆమె మండేలా కాలంలో జడ్జిగా నియమించబడి అక్కడి నల్ల జాతి పట్ల వివక్షనుఆమె జీవిత పాఠంగానేర్చుకుంది.

- భారత అవినాష్, జనగామ

## బస్సుల బోర్డులు ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ బస్సుల బోర్డులు స్పష్టమైన అక్షరాలతో ఉండాలి. పెద్దఅక్షరాలతో కనిపించే విధంగా ఉండాలి. ప్రతి బస్టాండ్ ప్లాట్ ఫారంలో కూడా ప్లాట్ ఫారం నెంబర్లపై కూడా గ్రామాలపేర్లు స్పష్టంగాఉండాలి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే వికలాంగులకు కూడా ఉచితబస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రతి బస్సులో వికలాంగులకు కేటాయించిన సీట్లలో వికలాంగులు మాత్రమే కూర్చునే విధంగా కండక్టర్ సహకరించాలి. 40శాతం వైకల్యం కలిగిన ప్రతి వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

## నిఘా వ్యవస్థ రంగంలోకి దిగాలి

ప్రకాశం జిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ప్రభుత్వభూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే, తన్ని తరిమి వేయాల్సిన రెవెన్యూ అధికారులు లంచాలు, ప్రలోభాలకు లొంగి భూములను దొంగలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. నిఘా సంస్థలు నిగ్గు తేల్చాలి. ప్రకాశం జిల్లాలో రామదూత అనే దొంగస్వామి చెరువు పోరంబోకు, అటవీ భూమి ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నాడు. అటవీ భూమిలో అనాథపిల్లల స్కూలుఅని చెప్పి జీవో తెచ్చుకొని, యజ్ఞాలు యాగాలు, దీక్షలు చేస్తున్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, తనిఖీకి వచ్చినవారిని ప్రలోభపెట్టిఅనుకూలంగా రిపోర్ట్‌వ్రాయించుకుంటాడు. చెరువు పోరంబోకులో కూడా యజ్ఞాలు చేస్తూ, పిల్లలు లేని వారికి పిల్లలు పుట్టిస్తాను, దీర్ఘరోగాలు నయం చేస్తానంటూమోసం చేస్తున్నాడు. అవినీతి నిరోధక శాఖవారు, ఇతర నిఘా సంస్థలు రంగంలోకి దిగి అవినీతి అధికారులకు శిక్షలు పడేలా చేయాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఎక్కువ వర్షాభావం ఏర్పడింది. చెరువులు, కుంటలు, బావులు, బోర్లు, ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు నిండుకున్నాయి. నీటిని అవసరమైనంత వరకే వాడాలని ప్రభుత్వ అధికారులు వార్తలు, మెసేజ్‌లు పంపుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన కారణంగా విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. ప్రజలు తమంత తాము భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా, నీటిని, విద్యుత్‌ను పరిమితంగా వినియోగించకపోయినట్లయితే ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యగానీటిని, విద్యుత్‌ని మితంగా టైమ్ ప్రకారంగా సరఫరా చేసే అవకాశం ఉంది. ఈ పొదుపు చర్య ఇంకా భారంగా, బాధగా ఉంటుంది. కాబట్టి ప్రజలే మితంగా వాడుతూ జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పెరుగుతున్న వృద్ధుల జనాభా

భారతదేశంలోవయోవృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. రాబోయే దశాబ్దాల్లో నగరాల్లో నివసించే వృద్ధుల సంఖ్య రెట్టింపు కానుందని అంచనా. ఈ నేపథ్యంలో మన నగరాల మౌలిక వసతులు, వ్యవస్థలు వయోధికుల అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఉన్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నగర రవాణా వ్యవస్థలు ఇప్పటికీ వృద్ధులకు సులభంగా అందుబాటులో ఉండటం లేదు.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

14-10Pg6exHMNWJQE.qxd:14-10Pg6exHMNWJQE.qxd 1/1/02 8:07 AM Page 1



# 'వేంకటాద్రి' యాప్‌తో భక్తులకు సులభంగాసమాచారం



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలవాడా గోవిందా గోవింద నామంతో తిరుమలకు వచ్చిన భక్తులకు అవసరమైన సకల సమాచారం క్షణాల్లో తెలుసుకునేలా రూపొందించిన "వేంకటాద్రి"యాప్ భక్తులకు చేరువైంది. ఈ యాప్ పనితీరు ఆఫ్‌లైన్‌లో ఇంటర్‌నెట్ లేకున్నా పనిచేసేలా రూపొందించారు. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం రూపొందించిన "వేంకటాద్రి" మొబైల్ యాప్‌ను సోమవారం వర్చువల్‌గా సిఎం ప్రారంభించిన విషయం విదితమే. దేవదేవుల నుండి తిరుమలకు విచ్చేసే భక్తులు వివిధ ప్రాంతాలను సులభంగా గుర్తించడంతోబాటు అవసరమైన సౌకర్యాలను త్వరగా చేరుకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు.24 గంటల పాటు సేవలందించే కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత వాయిస్ అసిస్టెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వాయిస్ కమాండ్ల ద్వారా శుద్ధిచేసిన జలప్రసాదకేంద్రాలు, దర్శన ప్రవేశ ద్వారాలు తదితర ప్రదేశాలను భక్తులు సులభంగా గుర్తించవచ్చు. ఇంటర్నెట్ సదుపాయం తక్కువగా ఉన్నా, పూర్తిగా అందుబాటులో లేకపోయినా ఉపయోగించుకునేలా ఆఫ్‌లైన్ నావిగేషన్ సదుపాయాన్ని కూడా ఇందులో కల్పించారు. ఈ యాప్‌లో 25 విభాగాలకు సంబంధించి 350కు పైగా ప్రదేశాల వివరాలను పొందుపరిచారు. ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు, పార్కింగ్ ప్రదేశాలు, మరుగుదొడ్లు, బస్ స్టాప్‌లు, దర్శన ప్రవేశ ద్వారాలు, లగేజీ కేంద్రాలు, ఉచిత పాదరక్షల డిపాజిట్ కేంద్రాలు, అన్న ప్రసాద కేంద్రాలు, ఆహార విక్రయ కేంద్రాలు, క్యాంటీన్లు, గది కేటాయింపు కౌంటర్లు, భక్తుల సహాయ కేంద్రాలు, టిటిడి కార్యాలయాలు, ఉప విచారణ కార్యాలయాలు, కల్యాణకట్టలు, పోలీస్ స్టేషన్లు, విజిలెన్స్ కార్యాలయాలు, ఆలయ పరిసరాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వెంగమాంబ అన్నప్రసాద సముదాయం తదితర సదుపాయాల వివరాలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంప్రదించేందుకు అత్యవసర ఫోన్ నంబర్లు, పోలీస్ సేవలతోబాటు టిటిడి హెల్ప్‌లైన్ వివరాలను యాప్‌లో పొందుపరిచారు. బస్సు మార్గాలు, సమయాలను కూడా తెలుసుకోవచ్చు. "మార్క్ మై స్పాట్"సదుపాయం ద్వారా భక్తులు తాము పార్కింగ్ చేసిన ప్రదేశాన్ని గానీ ఇతర ముఖ్యమైన ప్రాంతాన్ని గుర్తుగా సేవ్ చేసుకుని, తిరిగి ఆ ప్రదేశానికి సులభంగా చేరుకోవచ్చు. వేంకటాద్రి యాప్‌ను తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో రూపొందించారు. ఇది యాపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్‌లలో అందుబాటులో ఉంది. స్మార్ట్‌ఫోన్లు లేని భక్తులు కూడా ఈ సేవలను వినియోగించుకునేందుకు కియోస్కుల ద్వారా యాప్ సేవలను అందించే ఏర్పాట్లను టిటిడి చేపడుతోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనాన్ని ప్రశాంతంగా చేసుకునేందుకు ఈ యాప్ దోహదపడుతున్నారు.

## మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త** ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి ఎంపికైనట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నియామకానికి సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపినట్లు సమాచారం. గవర్నర్ ఆమోదం అనంతరం అధికారిక నియామక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. రాష్ట్రంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్ పదవి కొంతకాలంగా ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్త చైర్మన్ ఎంపిక ప్రాధాన్యం సంతరించుకుంది. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించడం, బాధితుల సమస్యలపై విచారణ జరపడం, సంబంధిత అధికారులకు సిఫార్సులు చేయడం కమిషన్ ప్రధాన బాధ్యతలు. కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యుల ఎంపికపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. అయితే నియామక ప్రక్రియ పూర్తయినట్లు నిర్ధారించాలంటే గవర్నర్ ఆమోదం, అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అప్పటివరకు జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎంపికను ప్రతిపాదిత నియామకంగానే పరిగణించాలి. జస్టిస్ సత్యనారాయణమూర్తి గతంలో ఉమ్మడి హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2013లో ఉమ్మడి హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2016లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022 జూన్‌లో పదవీ విరమణ చేశారు. న్యాయవ్యవస్థలో ఆయనకు ఉన్న అనుభవం మానవ హక్కుల కమిషన్ బాధ్యతల నిర్వహణలో కీలకంగా మారనుంది.

# టిటిడి వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయడం సాధ్యం కాదు

### - రూ.300 ఎస్ఇడి టికెట్లపై దుష్ప్రచారాన్ని నమ్మవద్దు- ఐటి జిఎం వేంకటేశ్వర్లు నాయుడు



**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తుల సౌకర్యార్థం టిటిడి విస్తృతంగా ఐటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని టిటిడి ఐటి జిఎం వేంకటేశ్వర్లునాయుడు తెలిపారు. దర్శన క్యూలైన్లపై నిరంతర పర్యవేక్షణ,క్యూలైన్ల నిర్వహణను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వేంకటాద్రి యాప్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం మధ్యాహ్నం తిరుమలలో మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడారు. త్వరలో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎఐ)వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ సాయంతో ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవ రోజున గ్యాలరీ పాసుల జారీకి క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల బుకింగ్‌పై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని వేంకటేశ్వర్లు నాయుడు విజ్ఞప్తి చేశారు. టికెట్లు పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉండగా, వాటికి పదిరెట్లు అధికంగా డిమాండ్ ఉండటంతో టికెట్లు లభించకపోవడాన్ని వెబ్‌సైట్‌లో సమస్యగా భావిస్తున్నారని తెలిపారు.టిటిడి వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయడం సాధ్యం కాదని, థర్డ్ పార్టీ యాప్‌లు, ఆటో ఫిల్లింగ్, కాపీ పేస్ట్ టూల్స్ ద్వారా టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని గుర్తించి ఎప్పటికప్పుడు బ్లాక్ చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. దర్శన టికెట్ల బుకింగ్‌పై సందేహాలుంటే టిటిడి అధికారిక హెల్ప్‌లైన్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. టిటిడి అధికారిక వెబ్ సైట్ ద్వారా శ్రీవారి దర్శనం, వసతి తదితర సేవలను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, శ్వేత డైరెక్టర్ డాక్టర్ వేమా వేంకటరత్నం పాల్గొన్నారు.

# ఎపిపిఎస్‌సి గూప్1 జవాబుపత్రాల కేసు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీళ్లు ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎపిపిఎస్‌సి గ్రూప్1 జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లపై జడ్జిమెంటు రిజర్వు అయింది. ఈ అంశంపై హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, జస్టిస్ హరిహరనాథ శర్మ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రూప్1 జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని నిర్ధారించడంతో పాటు పరీక్షను రద్దు చేసి తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చిలో 13న తీర్పు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ ఎపిపిఎస్సీ, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, పొందనివారు వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. వాస్తవాలు తేల్చేందుకు హైకోర్టు సిఐడి డిజి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. అక్రమాలు, ఫోర్జరీ ఆరోపణలపై దర్యాప్తు పూర్తి చేసి సిట్ తుది నివేదిక దాఖలు చేసింది. అప్పీళ్లు సోమవారం విచారణకు రాగా.. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు అభినంద్ కుమార్ షావలి, సివి మోహన్‌రెడ్డి, పి.శ్రీరఘురామ్ రిప్లై వాదనలు వినిపించారు. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేయడమే తప్ప ఎలాంటి ఆధారాలను కోర్టు ముందు ఉంచలేదు. పొరపాట్ల కారణంగా ఫలానా వ్యక్తి, ఫలానా గ్రూపు లాభపడిందని సిట్ ఎక్కడా చెప్పలేదు. ఎపిపిఎస్సీ అందించిన బ్లూ, బ్లాక్ పెన్నులను మాత్రమే వ్యాల్యుయేషన్ కోసం వినియోగించారు. ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పుల పై వేరే ఇంకు లేదు. డిజిటల్ మూల్యాంకనంలో ఎంపికైన అభ్యర్థులలో 62శాతం మంది తదుపరి నిర్వహించిన మాన్యువల్ మూల్యాంకనంలో ఎంపిక కాలేదని, అక్రమాలు జరగకుంటే ఈ స్థాయిలో వ్యత్యాసం ఉండదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి డిజిటల్ మూల్యాంకనం సైతం నిబంధనలకు అనుగుణంగా జరగలేదు. అర్హత లేని వారితో జవాబుపత్రాల మూల్యాంకనం చేయించారు. ఈ విషయాన్ని సిట్ తన నివేదికలో స్పష్టంగా చెప్పింది. అప్పటి ఎపిపిఎస్సీ ఇన్‌చార్జి కార్యదర్శి పిఎస్ఆర్ ఆంజనేయులు నిబంధనలకు విరుద్ధంగా హాయ్‌ల్యాండ్‌లో చేపట్టిన ప్రక్రియకు ఎలాంటి విలువ ఉండదు. ఉద్యోగాలకు ఎంపికైన, ఎంపిక కాని అభ్యర్థుల్లో 97 శాతం మంది అభ్యర్థుల ఓఎంఆర్ వ్యాల్యుయేషన్ స్లిప్పులపై దిద్దుబాట్లు ఉన్నాయని సిట్ చెబుతోంది. సిట్ నివేదిక ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకే అనుకూలంగా ఉంది. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసి అప్పీళ్లను అనుమతించండి అని వాదించారు. ఈ క్రమంలో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది.

# 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఎ.పి. జె.ఎ.సి. అమరావతి నిరంతరం అండగా ఉంటుందని రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మి ్మ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ్మ, పలిశెట్టి దామోదరరావుపేర్కొన్నారు.

ప్రస్తుత మహిళా విభాగం కాలపరిమితి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో అక్టోబరు 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి మహిళా సదస్సుతోపాటు, అదే రోజు అన్ని జిల్లా కమిటీల ఆమోదంతో '2026-2029 కాలానికి రాష్ట్ర నూతన కార్యవర్గ కమిట్టీని ఎన్నుకుంటారని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి మహిళా సదస్సులో 28 జిల్లాల డివిజన్, జిల్లా కమిటీలు, రాష్ట్ర స్థాయి మహిళా నాయకురాళ్లు, ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎస్వీ మ్యూజియం

**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో వేంకటేశ్వర మ్యూజియంను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసినట్లు చీఫ్ మ్యూజియం అధికారి సోమన్నారాయణ తెలిపారు. 50రూపాయలు మ్యూజియం ప్రవేశ రుసుంను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ టికెట్లను టిటిడి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలియజేశారు. తిరుమలలో మీడియా సెంటర్‌లో మంగళవారం సాయంత్రం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారని చెప్పారు. శ్రీవారి నవరాత్రి (బ్రహ్మోత్స)వాల అనంతరం ట్రైల్ రన్ నిర్వహించి, నవంబర్ మొదటి వారంలో ఎస్వీ మ్యూజియంను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మ్యూజియంలో మొత్తం 14 గ్యాలరీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బ్రహ్మాండం గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని తెలిపారు. తిరుమల చరిత్రను తెలియజేసేలా శిల్పకళలు, ఆలయ చరిత్ర, స్వామివారి ఆభరణాలు (డిజిటల్), ఆయుధాలు, సంగీత వాయిద్యాలు వంటి వివిధ కళా ఖండాలను ప్రదర్శనకు ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారిరవి, పిఆర్ఓ నీలిమ, మ్యూజియం క్యూరేటర్ శివ కుమార్ పాల్గొన్నారు.

# అధికారం జెన్‌జిదే, నాది బాల్‌థాకరే పాత్ర

### - దసరా తర్వాత కొత్త పార్టీ ప్రకటన: విజయసాయిరెడ్డి




విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్‌పై 'ఎక్స్' వేదికగా మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఆ దిశలో తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్‌జీ) అని తాజాగా మరో పర్యాయం కీలక వ్యాఖ్యలు చేశారు. తన "పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయ్ అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. 'మరోసారి చెపుతున్నా... అధికారం జెన్‌జీది, నాది బాల్ థాకరే పాత్ర' అని తన పోస్టులో వివరించారు. ఆయుర్వేద వైద్యం కోసం కేరళ వెళ్తున్నానని, ప్రస్తుతం ఎపిలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో వస్తుందన్నారు. అందుకనే దసరా తరువాత పార్టీని ప్రకటిస్తానని స్పష్టం చేసారు.

# ఆంధ్ర-కర్ణాటక రంజీ మ్యాచ్

## 418 పరుగుల భారీ స్కోరు సాధించిన ఆంధ్రా జట్టు

### రెండో ఇన్నింగ్స్‌లో 176 /4 తో కొనసాగుతున్న కర్ణాటక

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మూలపాడు వేదికగా ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అంతకుముందు ఆంధ్ర జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 418 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆంధ్ర బ్యాటర్లలో ఎస్వీ రాహుల్ 119 పరుగులతో సెంచరీ సాధించగా, రేవంత్ రెడ్డి 97 పరుగులు, షేక్ రషీద్ 54 పరుగులతో రాణించారు. కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి ఆరు వికెట్లు పడగొట్టగా, మాధవ్ బజాజ్, రితేష్ బత్కల్ చెరో రెండు వికెట్లు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు తరఫున కరుణ్ నాయక్ 130 బంతుల్లో 81 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. మన్వంత్ కుమార్ 110 బంతుల్లో 44 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో సౌరభ్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టగా, లలిత్ మోహన్ ఒక వికెట్ సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ మరోసారి నిరాశపరి చాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు పరుగులకే వెనుదిరిగిన రాహుల్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఒక పరుగు మాత్రమే చేసి వికెట్ కోల్పోయాడు. రాహుల్ బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులకు ఆయన ప్రదర్శన నిరాశ మిగిల్చింది. మ్యాచ్‌కు రేపు చివరి రోజు కావడంతో ఇరు జట్ల ప్రదర్శనపై ఆసక్తి నెలకొంది. కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 176 పరుగుల వద్ద నాలుగు వికెట్లు కోల్పోయారు.

# తిరుమల సమాచారం

## ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో చిన్నశేష వాహనంపై మలయప్ప



**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐదు తలల చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. తిరుమలలో మొదలైన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం మలయప్పస్వామి సర్వాలంకార భూషితుడైన స్వామిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముందుగా గజాలు, అశ్వాలు నడుస్తుండగా, భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, వివిధ కళాబృందాల ప్రదర్శనల నడుమ వాహనసేవ కన్నులపండువగా సాగింది. గోవింద నామస్మరణలతో తిరుమల మాడ వీధులు మార్మోగాయి. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి దంపతులు, పాలకమండలి సభ్యులు, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ పేష్కార్ రామకృష్ణ; అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో - 17 కళాబృందాలు, 489 మంది కళాకారుల ప్రదర్శనలు



**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల్లో మొదలైన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం చిన్నశేష వాహనం ముందు గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, భక్తిగీతాల నడుమ సాగిన వాహనసేవ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆంధ్రప్రదేశ్‌తో బాటు తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 17 కళాబృందాల్లోని 489 మంది కళాకారులు తమ ప్రాంతీయ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేకమైన తప్పెటగుళ్ల నృత్యం లయబద్ధమైన అడుగులు, తప్పెట వాయిద్యాల ధ్వనులతో అలరించింది. ఈ ప్రదర్శన ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పింది. అరకులోయ గిరిజన ప్రాంతానికి చెందిన థింసా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భుజాలపై చేతులు వేసుకుని వృత్తాకారంలో లయబద్ధంగా నృత్యం చేసిన గిరిజన కళాకారులు తమ ఐక్యతను, ఆనందోత్సాహాలను ప్రతిబింబించారు. తమిళనాడుకు చెందిన కురత్తి నృత్యం జానపద కథలు, హావభావాలు, సంభాషణలతో తమిళ సంప్రదాయ కళావైభవాన్ని ఆవిష్కరించింది. ఉడిపి, దక్షిణ కన్నడ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాటలు, నృత్యాల సమ్మేళనంతో తమ ప్రాంతీయ జానపద సంప్రదాయాలను ప్రదర్శించి భక్తులను అలరించారు.

## శ్రీవారిని దర్శించుకున్న సినీనటుడు విజయ్ దేవరకొండ, రష్మిక

**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** దసరా కానుకగా ఈనెల 16వతేదీ సినీనటుడు విజయ్ దేవరకొండ, నటి రష్మిక దంపతులు నటించిన 'రణబాలి' చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా దంపతులు మంగళవారం వేకువజామున తిరుమలకు చేరుకుని స్వామివారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన సినీనటులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించి ఆనందనిలయంలో శ్రీవారి సుప్రభాతసేవలో దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన సినీనటులు, దంపతులు విజయ్‌దేవరకొండ, రష్మికనూ చూసేందుకు, వారితో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు సుముఖత చూపారు. అందరినీ నవ్వుతూ పలకరించి వెళ్ళారు.

## దసరా సెలవుల్లో కనిపించని భక్తుల రద్దీ



**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** దసరా సెలవులు, పెరటాసి మాసం చివరివారం కావడంతోబాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతూన్నా తిరుమలలో భక్తుల రద్దీ పెద్దగా లేదు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లోని 17 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, పాలను అందిస్తోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 83,322 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.2.93 కోట్లు చేకూరింది. గ్యాలరీలు కూడా భక్తులు లేక వెలవెలపోతున్నాయి.

## భక్తుల భద్రతకు ప్రాధాన్యం

### బందోబస్తు ఏర్పాట్లపై పోలీసుల నిరంతర పర్యవేక్షణ

**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీకృష్ణ పోలీసు కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడి భద్రత పోలీసుల ప్రధాన బాధ్యతని, విధుల్లో ఉన్న ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో, సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లను సమీక్షిస్తూ మాడ వీధులు, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధుల్లో రద్దీని క్రమబద్ధీకరించాలని, తోపులాటలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్యాలరీల్లోకి భక్తులను క్రమపద్ధతిలో అనుమతించడం, దర్శనం అనంతరం సురక్షితంగా బయటకు పంపించడం, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం ద్వారా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల సహాయంతో రద్దీని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు.

సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించినా, కేటాయించిన పాయింట్లను విడిచిపెట్టినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సివిఎస్ఒ మురళీకృష్ణ మాట్లాడుతూ బందోబస్తు సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో స్పష్టమైన విధుల కేటాయింపు, పాయింట్‌టుపాయింట్ బ్రీఫింగ్‌తో పాటు పోలీసు, టిటిడి విజిలెన్స్, ఇతర విభాగాల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. మాడ వీధుల్లోని గ్యాలరీల సామర్థ్యాన్ని సమర్థంగా వినియోగిస్తూ, సిసి కెమెరాల ద్వారా రద్దీని అంచనా వేసి భక్తులను క్రమపద్ధతిలో అనుమతించాలని తెలిపారు.

## తిరుమలలో మూడు నిమిషాలకో బస్సు

**తిరుమల, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్ బస్సులతో (శ్రీవారి ధర్మ రథాలు) పెద్ద ఎత్తున కాలుష్యాన్ని అరికడుతున్నట్లు టిటిడి రవాణా విభాగం జిఎం రాము తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో 38 ఎలక్ట్రిక్ బస్సులు రెండు రూట్లలో భక్తులకు సేవలు అందిస్తున్నాయని చెప్పారు. ప్రతి 3 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులోకి తీసుకురావడంతో భక్తులు ఉచిత రవాణా సదుపాయాన్ని విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. గతంలో రోజుకు 300 ట్రిప్పుల ద్వారా 35 వేల మంది భక్తులు ప్రయాణించేవారనీ, ప్రస్తుతం 850 ట్రిప్పులకు పెంచడంతో ఉచిత బస్సుల్లో ప్రయాణించే భక్తుల సంఖ్య దాదాపు 80వేలకు చేరిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 20 బస్సులను అదనంగా పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తద్వారా మరింతమంది భక్తులు ఉచిత బస్సుల్లో సౌకర్యవంతంగా ప్రయాణించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మీడియా సమావేశంలో సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ పాల్గొన్నారు.

# తిరుమలలో స్వయం ప్రతిరక్షక వ్యాధిగ్రస్తులకు దర్శనంపై అధ్యయనం !

**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** కలి యుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి క్షణకాల దర్శనం కోసం లక్షలాదిమంది భక్తులు పరితపిస్తుంటారు. వారిలో వృద్ధులు, దివ్యాంగులు, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న వాళ్ళకు ధార్మికసంస్థ టిటిడి ప్రత్యేక క్యూలైన్‌ద్వారా ఎలాంటి తోపులాటలు లేకుండా ప్రశాంతంగా సాఫీగా స్వామివారి దర్శనం చేసుకునేలా చూస్తోంది. ఇదే తరహాలో ఇప్పుడు ఆటో ఇమ్యూన్, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి "మెడికల్ కేసెస్"కేటగిరీలో తిరుమలలో శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించాలని ఇప్పటికే విజ్ఞప్తులు చేరుతూన్నాయి. ఈ అంశాన్ని పరిశీలించేందుకు టిటిడి ఉన్నతాధికారులు ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే రోజువారీగా వెయ్యిమంది వరకు భక్తులకు ప్రత్యేక కేటగిరి క్రింద ప్రత్యేక దర్శనం ప్రతిరోజూ సాయంత్రం 3.30గంటలకు అనుమతినిస్తోంది. ఇదే తరహాలో ఇప్పుడు ఆటో ఇమ్యూన్, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆ దేవదేవుడు శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించే అంశంపైటిటిడి సానుకూలంగానే అధ్యయనం చేస్తోంది. సిస్టమిక్ లూపస్ ఎరిథెమటోసస్ (ఎస్ఎల్ఇ), స్క్లెరోడెర్మా, మల్టిపుల్ స్క్లెరోసిస్, అల్సరేటివ్ కోలైటిస్, క్రోన్స్ డిసీజ్, సికిల్‌సెల్ అనీమియా, తలసేమియా తదితర వ్యాధిగ్రస్తులకు ఈ సౌకర్యం కల్పించే అంశాన్ని బహుళ విభాగాల నిపుణుల కమిటీకి టిటిడి నివేదించింది. ప్రస్తుతం టిటిడి మెడికల్ కేసెస్ కేటగిరిలో మూత్రపిండాల మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, డయాలసిస్, కాలేయ మార్పిడి, మెదడు ఆపరేషన్, క్యాన్సర్, నడవలేని స్థితికి దారితీసే స్పైన్ సర్జరీ బాధితులకు మాత్రమే ఆన్‌లైన్ ముందస్తు బుకింగ్ ద్వారా ప్రత్యేక దర్శనం ఉచితంగా కల్పిస్తోంది. ఆటో ఇమ్యూన్, నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్-2021 కింద గుర్తించిన వ్యాధిగ్రస్తులకూ ఈ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇటీవల శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన హైకోర్టు న్యాయవాది ఎస్.కె. శ్రీకృష్ణ యశస్వి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని టిటిడిని ఆదేశించింది. దీంతో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర టిటిడి ముఖ్యవైద్యాధికారి, స్విమ్స్ డైరెక్టర్/ వైస్ చాన్స్‌లర్ అభిప్రాయాలను కోరారు. మే 27న స్విమ్స్ లో జరిగిన నిపుణుల సమావేశంలో వ్యాధుల రకాలు, తీవ్రత, వైకల్య స్థాయి వేర్వేరుగా ఉండటం,

ఆన్‌లైన్‌లో వైద్య ధ్రువపత్రాల ధ్రువీకరణలో ఎదురయ్యే సమస్యల కారణంగా వెంటనే ఈ వ్యాధులను మెడికల్ కేసెస్ కేటగిరీలో చేర్చడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

> **కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**

**నరసాపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:** జీవన ప్రమాణాలను మెరుగుపరచి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. నరసాపురం మండలం పెద్దమైనవానిలంక గ్రామంలో మంగళవారం ఎస్‌బిఐ సిఎస్ఆర్ నిధులతో రూ.50 లక్షల విలువైన 7 ఆటోలు, 12 మోపెడ్లు, 20 బోట్లు, వలలను 39 మంది మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. పెద్దమైనవానిలంకలో సముద్ర కోత నివారణకు రక్షణ గోడ నిర్మాణం, డిజిటల్ భవనం, సోలార్ విద్యుత్ సదుపాయాల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే జీవన భృతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆటోలు, మోపెడ్లతో చేపల రవాణా,విక్రయాలు సులభతరమవుతాయన్నారు.

# 'పవర్ టు ఎంపవర్'బాటలో సాగుతున్నాం

## డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్‌ఛేంజర్

## చైనా కంటే మెరుగ్గా ఇండియా వృద్ధిరేటు

## 'బ్లూమ్‌బెర్గ్ న్యూఎకానమీ ఫోరం'లో ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** సాంకేతిక అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సాంకేతిక పురోగతి, సమాచారం, విజ్ఞానం, వినూత్న ఆలోచనల ఫలితాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా కోట్లాది మంది ప్రజల సాధికారతకు ఉపయోగపడాలన్నారు. అధికారం ఎవరి చేతుల్లో ఉందన్నది ముఖ్యం కాదని, దాన్ని ప్రజల అభ్యున్నతికి ఎలా ఉపయోగిస్తున్నామన్నదే కీలకమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో తొలిసారిగా 'ఎ వరల్డ్ ఇన్ ప్లే, డిఫైనింగ్ ది న్యూ లీవర్స్ ఆఫ్ పవర్స్ థీమ్‌తో నిర్వహిస్తున్న 8వ 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రధానమంత్రి నరేం ద్ర మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'పవర్ టు ఎంపవర్స్ అనే దూరదృష్టితో తాము ముందుకు సాగుతున్నామని చెప్పారు. డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిలు స్తాయన్నారు. ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పులను ప్రధాని వివరించారు. కేవలం అధికారాన్ని చెలాయించడం కంటే ప్రజలను సాధికారత వైపు నడిపించడం ముఖ్యమని ఒకరితో ఒకరు పోటీపడే శక్తికంటే పరస్పరం సహక రించుకునే ధోరణి పెరగాలన్నారు. మన సొంత విజయాల కంటే ఇతరులు విజయం సాధించడంలో సహాయపడే దిశగా ఆలోచించాలని సూచించారు. జ్ఞానం,సంపద,అధికారం ఎవరి వద్ద ఉన్నాయనేది కాదు వాటిని ఏఉద్దేశంతో ఉపయోగిస్తున్నారనేదే ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేటి కాలంలో ఈ తత్వాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మన వేల యేళ్ల సంప్రదాయం ఇదే మనకు నేర్పింది. దీనిని మేము ఆచరణ ద్వారా నిరూపించామని ప్రధాని మోడీ వివరించారు. భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అను భవించడానికి అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వా నిస్తూ, భారతదేశంలో దేశంలోని వివిధ పరి మా ణాల వ్యాపారాలు ఒకే వేదికను ఉపయో గిం చవచ్చని మోడీ పేర్కొన్నారు. "మన దేశంలో, ఒక వీధి వ్యాపారికి, ఒక కార్ల షోరూమ్‌కు వేర్వేరు రకాల వ్యాపారాలు ఉంటాయి. అవి వేర్వేరు స్థా యిలలో పనిచేస్తాయి, కానీ భారతదేశంలో, రెం డూ ఒకే డిజిటల్ చెల్లింపుల వేదికను ఉప యో గిస్తాయ్ని అని ఆయన అన్నారు. "ఇదే సమ్మిళిత సాంకేతికత శక్తిఅని ఆయన పేర్కొంటూ, డిజి టల్ ప్రజా మౌలిక సదుపాయాలు, సరసమైన మొబైల్ డేటా, డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు ఆర్థిక అవకాశాలకు ప్రాప్య తను విస్తృతం చేశాయని తెలిపారు. భారతదేశ స్టార్టప్ వ్యవస్థ 2014కు ముందు కొన్ని వందల సంస్థల నుండి ఇప్పుడు 2.5 లక్షలకు పైగా విస్త రించిందని ప్రధాని అన్నారు. ఈ స్టార్టప్‌లలో దా దాపు సగంచిన్ననగరాలు, పట్టణాలలో ఉన్నాయి, కాగా 45 శాతం సంస్థలలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారు. సాంకేతికత ఆధారిత సంక్షేమ బదిలీలు కూడా పేదరిక నిర్మూ లనకు దోహదపడ్డాయని, గత దశాబ్ద కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయ టపడ్డారని మోడీ నొక్కి చెప్పారు.

భారతదేశ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ప్రస్తుతం భారత ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని అన్నారు. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 7.8 శాతం ఆర్థిక వృద్ధి, 700 బిలియన్ డాలర్లకు పైగా ఉన్న విదేశీ మారక నిల్వలు, పన్నులు, దివాలా, కార్మికచట్టాలలో సంస్కరణలు భారతదేశ స్థితి స్థాపకతకు సూచికలని మోడీ పేర్కొన్నారు.

**స్వచ్ఛ ఇంధనం, సంస్కరణలు కీలక ప్రాధాన్యతలు:** పారిస్ వాతావరణ ప్రతిజ్ఞ కింద 2030 గడువుకు ముందే, నవంబరు 2021 నాటికే శిలాజేతర ఇంధనాల నుండి స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 40శాతం సాధించాలన్న లక్ష్యాన్ని భారతదేశం సాధించిందని ప్రధాని మోడీ అన్నారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2014లో సుమారు 75 గిగావాట్ల నుండి ఇప్పుడు దాదాపు 300 గిగావాట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. గృహ సౌరవిద్యుత్ వినియోగానికి, రైతుల సౌర విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇచ్చే పిఎం సూర్య ఘర్, పిఎం కుసుమ్‌పథకాలను కూడా ఆయన ప్రస్తావించారు. కాగా ఈ 8వ బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీఫోరమ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రముఖ నాయకులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు. మారుతున్న భూ రాజకీయాలు, ఆర్థిక సవాళ్లు, భవిష్యత్ ప్రగతికి సంబంధించిన అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించనున్నారు.

# సర్‌పై కాంగ్రెస్ పిటిషన్‌లో 14 లోపాలు!

## సరిచేసి మళ్లీ దాఖలు చేయాలని సుప్రీం రిజిస్ట్రీ ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** సర్‌లో పెద్దఎత్తున ఓట్ల తొలగింపు సహా అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు 10 మంది ప్రతిపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రాలేదు. ఈ పిటిషన్‌లో సుప్రీం కోర్టు రిజిస్ట్రీ గుర్తించిన లోపాలను పిటిషనర్లు ఇంకా సవరించకపోవడమే కారణంగా తేలింది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఈ పిటిషన్‌లో రిజిస్ట్రీ మొత్తం 14 లోపాలను గుర్తించింది. కోర్టుకు చెల్లించాల్సిన రుసుములో 220 రూపాయలు తక్కువ పడటం కూడా వాటిలో ఒకటని తెలిపింది. మిగిలిన లోపాల్లో తొమ్మిది మంది పిటిషనర్ల అధికారిక అనుమతి పత్రాలు లేవని, కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే గుర్తింపు కార్డు నకలులో ఆయన ఫొటో ఐడీ స్పష్టంగా లేదని వివరించింది. పిటిషన్‌లో పొందుపరిచిన కొన్ని పత్రాలు చదవడానికి వీలులేకుండా ఉన్నాయని వివరించింది. పేజీల నంబరింగ్ క్రమంలో వ్యత్యాసాలు వంటి లోపాలున్నాయని, వాటిని సవరించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆదేశించింది. మంగళవారం ఈ వ్యవహారాన్ని ఒక జర్నలిస్ట్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రస్తావించగా, సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. లోపాలను సరిదిద్దినట్లయితే వారి అంశాలను విచారణ కోసం జాబితా చేస్తామని తెలిపింది. మేము ఈ పిటిషన్లన్నింటినీ విచారణకు జాబితాచేస్తాము. ముందుగా అందులోని లోపాలన్నీ సవరించేలా చూసుకోండని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఖర్గేతో పాటు టిఎంసి ఎంపీ సౌగతా రాయ్,సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ (శరద్ పవార్ వర్గం) నేత సుప్రియా సూలే, శివసేననేత సంజయ్ రౌత్, సిపిఐకు చెందిన డి. రాజా, ఝార్ఖండ్ ముక్తి మోర్చాఎంపీ మహువా మాఝీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ముస్లిం లీగ్ నేత ఇ.టి. మహమ్మద్ బషీర్ తదితరులు సహ పిటిషనర్లుగా ఉన్నారు. ఈ కేసులో భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలను ప్రతివాదులుగా చేర్చారు.




## లడఖ్ భారత్‌లో అంతర్భాగమే

# చైనాకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్

## 28 వ్యూహాత్మక ప్రాంతాలకు భారత్ అధికారిక పేర్లు

**లడఖ్, అక్టోబరు 13:** లడఖ్ భారత్ అంతర్భాగమని, చైనా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఈ వాస్తవాన్ని మార్చలేరని భారత విదేశాంగ శాఖ స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని 28వ్యూహాత్మక ప్రాంతాలకు, భౌగోళిక ప్రదేశాలకు అధికారికంగా పేర్లు నిర్ధారించి భారత మ్యాప్‌లో చేర్చడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ ఈ ప్రకటన చేసింది. ఈ నెల 2న కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని పలు ప్రాంతాలనుఅధికారికంగా గుర్తించింది. వాస్తవాధీనరేఖ (ఎల్‌ఏసి) వెంబడి ఉన్న గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి సున్నితమైన సరిహద్దు ప్రాంతాలు కూడా ఈజాబితాలో ఉన్నాయి. 2020లో భారత్, చైనాల మధ్య నెలకొన్న గాల్వాన్ ఘర్షణ సమయంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ కీలక ఘర్షణ ప్రాంతాలుగా నిలిచాయి. భారత్ గుర్తించిన ఇతర ప్రాంతాల్లో అలీషీగిరి, బ్రాంగ్సా, చాప్చింగల్ పాస్, కనిష్కపీక్, కరుణనపీర్ పర్వతం, కుక్సెల్, మార్తండ్ గిరి, పార్విక్ హిమానీనదం, స్వామి హిమానీనదం, షాచ్మిరిక్ పాస్, ష్యోర్గా లోయ, జొరావర్ పీక్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. అయితే, భారత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ తప్పుపట్టారు. భారత్ ఏకపక్షంగా ఈ నిర్ణయాన్ని తీసుకుందని, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంగా తాము గుర్తించబోమని అన్నారు. భారత్ పేర్లు పెట్టడం చట్టవిరుద్ధమని, చైనా-భారత్ సరిహద్దు పశ్చిమ ప్రాంతంలోని సంబంధిత భూభాగాలు చైనాకే చెందుతాయని ఆమెవాదించారు. తాజా ప్రకటనలో భారత్ చైనా వ్యాఖ్యలకు చెక్ పెట్టింది.

# ఉగ్రవాదంపై పోరులో భారత్ వెనక్కి తగ్గేదేలేదు..

## బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సదస్సులో అమిత్ షా



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బిమ్‌స్టెక్ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఉగ్రవాదులు ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లి దాక్కోవడం, అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, కొత్తవారిని నియమించుకోవడం, శిక్షణ ఇవ్వడం వంటి వాటిని అడ్డుకోవాలని అమిత్ షా అన్నారు. పొరుగు దేశాలపై దాడులకు ప్రణాళికలు వేయడం, వాటి కోసం వనరులను సమకూర్చుకోవడం వంటి చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఒక దేశానికే పరిమితమైన సమస్య కాదని, దాని ప్రభావం అనేక దేశాలపై ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు.



# న్యూయార్కు ఎయిర్‌పోర్టులో యూనస్‌కు అవమానం

**న్యూయార్కు, అక్టోబరు 13:** న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నెడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక ప్రభుత్వాధిపతి మహమ్మద్ యూనస్‌కు ప్రవాస బంగ్లాదేశీయుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన చేసిన తొలి విదేశీ పర్యటనలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఆయనను వెంటనే విమానాశ్రయం నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. నువ్వు బంగ్లాదేశ్‌ను తగలబెట్టావు అంటూ నిరసనలు ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎయిర్‌పోర్టు బయట గుమిగూడిన నిరసనకారులు యూనస్ కు వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. "నువ్వు ఒక ఉగ్రవాదివి. బంగ్లాదేశ్‌లో వేలాది మందిని, పోలీసులను చంపావు. ఇక్కడికి ఎందుకు వచ్చావు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహమ్మద్ యూనస్ చర్యల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం నాశనమైందని, బంగ్లాదేశ్ అశాంతితో తగలబడిపోయిందని నిరసనకారులు ఆరోపించారు. లోపలికి తిరిగి వెళ్లిన యూనస్ భద్రతా సిబ్బంది చర్యలు ఎయిర్‌పోర్టు బయట పరిస్థితి క్షణక్షణానికి ఉద్రిక్తంగా మారడాన్ని గమనించి యూనస్, ఆయన సహోద్యోగి లామియా మోర్షెడ్ వెంటనే ఎయిర్‌పోర్టు లోపలికి తిరిగి వెళ్లిపోయారని స్థానిక మీడియా పేర్కొంది.

# పరీక్షల నిర్వాహణలో పారదర్శకత పెంచాలి

## ప్రశ్నపత్రాలకు ఎఐ వినియోగం పరిశీలించాలి

## నీట్ ప్రత్యేక కమిటీ ఛైర్మన్ నందన్ నీలేకని



**న్యూఢిల్లీ,అక్టోబరు 13:** దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, ప్రశ్నపత్రాల లీకేజీలకు అడ్డుకట్టవేయడానికి సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని యూఐడీఏఐ మాజీ ఛైర్మన్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సూచించారు. పరీక్ష జరిగే రోజునే ఏఐ సాయంతో ప్రశ్నపత్రాన్ని రూపొందించే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ముందుగానే ప్రశ్నపత్రాలను తయారుచేసి భద్రపరిచే పద్ధతికి బదులుగా చివరి నిమిషంలో ప్రశ్నలను ఎంపిక చేసి పేపర్ రూపొందిస్తే లీకేజీలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. మంగళవారం భారత్‌లో నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న నీలేకని, దేశ పరీక్షల వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం పరీక్షలకు ముందుగానే ప్రశ్నపత్రాలను రూపొందించి, వాటిని భద్రపరిచి, పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేసే విధానంలో లీకేజీలకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రశ్నపత్రాల తయారీ విధానంలోనే మార్పులు తీసుకురావాలని నీలేకని సూచించారు. ఒకే ప్రశ్నపత్రాన్ని ముందుగానే సిద్ధం చేయడానికి బదులుగా, పెద్ద సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంకును రూపొందించాలని ప్రతిపాదించారు. పరీక్ష జరిగే రోజున, చివరి నిమిషంలో ఆ బ్యాంకు నుంచి ప్రశ్నలను ఎంపిక చేసి ప్రశ్నపత్రాన్ని తయారు చేయవచ్చని వివరించారు. ఇలా చేయడం వల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించాలనే అక్రమ ప్రయత్నాలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ప్రశ్నల బ్యాంకు నుంచి పరీక్ష జరిగే రోజే ప్రశ్నపత్రాన్ని రూపొందించేందుకు కృత్రిమ మేధను ఉపయోగించవచ్చా అన్న ప్రశ్నకు నీలేకని సానుకూలంగా స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరీక్షా పత్రాలను రూపొందించే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణను విస్తరించే అంశాన్నీ కమిటీ పరిశీలిస్తోందని నీలేకని వెల్లడించారు. ప్రస్తుతం ఇలాంటి పరీక్షలు రాయడానికి దేశంలో సుమారు 1.5 లక్షల ప్రదేశాల్లో సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలంటే ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో మార్పులను సూచించేందుకు జులైలో కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనికి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారు.

## హౌతీదాడులతో బంకర్లలోకి

# సౌదీ యువరాజు

**రియాద్, అక్టోబరు 13:**సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు క్షిపణి, డ్రోన్ దాడులను తీవ్రతరం చేయడంతో



ఆ దేశ వాస్తవ పాలకుడు, యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ప్రాణభయంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. అమెరికన్ మీడియా కథనాల ప్రకారం ఆయన రియాద్‌లోని అత్యంత పటిష్ఠమైన భద్రత, బంకర్లు కలిగిన రాజప్రాసాదాల మధ్య తన మకాం మారుస్తున్నారు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన భద్రతా బృందం ఆయనకు నిరంతరం కాపలా కాస్తోంది. గడిచిన మంగళవారం ఓ రక్తదాన శిబిరంలో పాల్గొన్న తర్వాత ఆయన మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. ఇటీవలి కాలంలో హౌతీలు సౌదీ రాజధాని రియాద్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు పెంచడమే ఈ భద్రతాపరమైన ఆందోళనలకు ప్రధాన కారణం. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో 12నుంచి 13 మంది ప్రాణాలుకోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్ కూడా తీవ్రంగా దెబ్బతినడంతో విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మరోవైపు హౌతీల నుంచి వస్తున్నదాడులను అడ్డుకోవడానికి అవసరమైన ఇంటర్‌సెప్టార్ క్షిపణుల నిల్వలు సౌదీ అరేబియాలో వేగంగా అడుగంటుతున్నాయని సౌదీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అందుబాటులో ఉన్న వాయురక్షణ వ్యవస్థలను రాజకుటుంబ నివాసాలు, ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, ఇతర వ్యూహాత్మక ప్రాంతాల రక్షణ కోసం తరలిస్తున్నారు.



# నీటిని వృథా చేస్తే రూ.5వేలు ఫైన్

## నాగ్‌పూర్ మున్సిపాలిటీ కొత్త నిర్ణయం

**నాగ్‌పూర్, అక్టోబరు 13:** దేశంలో అత్యంత కరువు ఎదుర్కొనే రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. అక్కడ అనేక ప్రాంతాల్లో నీటి వనరులు చాలా తక్కువ. అందులోనూ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడి, నీటి వనరులు తగ్గిపోయాయి. ఇదే సమయంలో పెద్ద పటణాలైన నాగ్‌పూర్, పుణేలను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. ఉన్న నీటి వనరుల్ని సక్రమంగా వాడుకునేలా, నీరు వృథా, దుర్వినియోగం కాకుండా చూసేలా కఠిన చర్యలకు అక్కడి పాలకవర్గం సిద్ధమైంది. దీనిలో భాగంగా నీటిని వృథా చేసేవారికి రూ.5,000 జరిమానా విధించాలని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించింది. మరో పెద్ద పట్టణమైన పూనేలో కూడా పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్టోబర్ 15 నుంచి వారానికోసారి నీటికి వీక్లీ కట్ ఇవ్వనుంది. ప్రతి గురువారం నీటి సరఫరా ఉండదు. నాగ్‌పూర్‌కు సంబంధించి నీటి రేషనింగ్‌ను ఎన్‌ఎంసీ పరిశీలిస్తోంది. నగరంలో నీటికొరతపై మేయర్ నీతా తకారే అధికారులతో సమీక్ష జరిపారు. నీటి లభ్యత, సరఫరా వంటి వివరాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిని సద్వినియోగం చేసుకునే చర్యలపై దృష్టిపెట్టారు.

# డ్రగ్స్‌పై ప్రశ్నించినందుకు లైవ్‌లోనే హత్య

**అమృత్‌సర్, అక్టోబరు 13:** పంజాబ్‌లో తీవ్ర కలకలం రేపిన ఘటనలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సామాజిక కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. పర్విందర్ సింగ్ జోతా అనే యాక్టివిస్ట్‌ను ఓ మెడికల్ షాపు యజమాని కాల్చి చంపాడు. ఈ దారుణం మొత్తం జోతా ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రత్యక్ష ప్రసారం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన ఇవాళ ఉదయం పంజాబ్‌లోని మాన్సా పట్టణంలో జరిగింది. కొన్ని సంవత్సరాలుగా డ్రగ్స్ బుక్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా, యజమాని అశ్వనీ కుమార్ తుపాకీ బయటకు తీశాడు. అది చూసిన జోతా ఏమాత్రం భయపడకుండా, నన్ను చంపు అంటూ అతడికి పలుమార్లు సవాలు విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన అశ్వనీ కుమార్ జోతాపై కాల్పులు జరిపాడు. పొట్ట, తొడ భాగంలోకి బుల్లెట్లు దూసుకెళ్లగా, ఒక బుల్లెట్ కాలేయాన్ని చీల్చడంతో జోతా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని మాన్సా సివిల్ ఆసుపత్రికి తరలించగా,




మాఫియాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్విందర్ సింగ్ జోతా, స్థానిక మెడికల్ షాపుల్లో సింథటిక్ డ్రగ్స్ అక్రమ అమ్మకాలను సోషల్ మీడియా లైవ్ వీడియోల ద్వారా బహిర్గతం చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం, అశ్వనీ కుమార్ అనే వ్యక్తికి చెందిన మెడికల్ షాపు వద్దకు వెళ్లారు. ఉదయం అదే షాపులో నిషేధిత మందులు కొనుగోలు చేశాడని చెబుతున్న ఓ వృద్ధుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. డ్రగ్స్ అమ్మకాలపై యజమానిని నిలదీయడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదాన్ని జోతా ఫేస్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో జోతా సహచరులలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హత్య అనంతరం నిందితుడు అశ్వనీ కుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అతడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తన క్రియాశీల కార్యకలాపాల వల్ల జోతా కూడా 2023లో ఒకసారి అరెస్ట్ అయ్యారు. ఈ హత్య ఘటన పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రతను మరోసారి కళ్లకు కట్టింది.

# సంక్షిప్త వార్తలు

## జంతర్‌మంతర్ వద్ద సిజెపి నేతల అరెస్టు



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:**ప్రధాన ఎన్నికలకమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో భాగంగా కాక్రోచ్ జనతాపార్టీ నాయకులు మంగళవారం ఉదయం జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. సీజేపీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నేతృత్వంలో నిరసనకారులు ఆందోళనలను చేపట్టారు. అయితే వీరిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో నిరసనకారులు బారికేడ్లు, గేట్లను దూకుతూ నిరసన ప్రదేశానికి వెళ్తున్నట్టు కనిపిస్తోంది.

## యుపిఐ ఎండిఆర్ ఛార్జీలు పండగ సీజన్ తర్వాతే




**ముంబయి, అక్టోబరు 13:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలపై ప్రతిపాదిత ఎండీఆర్ ఛార్జీల అమలును వాయిదా వేస్తున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. పండగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో వ్యాపారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీంతో వ్యాపార వర్గాలకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది. ఈ విషయంపై మంగళవారం సమావేశమైన యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, ఈ నిర్ణయాన్ని ఖరారు చేసింది.

## పరువు నష్టంకేసులో రాహుల్‌కు సుప్రీంలో ఊరట



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రధాని నరేంద్ర మోడీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న పరువునష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కింది కోర్టు విచారణపై మధ్యంతర స్టే విధిం చింది. రాహుల్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదే శించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

## రాహుల్ నన్ను తోసేశారు..మహిళా జర్నలిస్టు ఆరోపణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఒక మహిళా జర్నలిస్ట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ తన చేయి పట్టుకుని లాగి, తోసేశారని ఆమె ఆరోపించారు. మూడు నెలల గర్భిణి అయిన జర్నలిస్ట్ రిచా పరాశర్ ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చేరారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా బిజెపి చేస్తున్న దుష్ప్రచారమని కొట్టిపారేసింది.

## అంతరిక్షంలో వ్యోమగామి అనిల్ మీనన్ యోగాసనాలు



**న్యూయార్కు, అక్టోబరు 13:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి, యూఎస్ స్పేస్‌ఫోర్స్ కల్నల్ అనిల్ మీనన్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి ఒక స్ఫూర్తిదాయక వీడి యోను పంచుకున్నారు. అంతరిక్షంలో గురుత్వాకర్షణలేని (మైక్రోగ్రావిటీ) స్థితిలో వ్యాయామం ఎంత కీలకమో వివరిస్తూ ఆయన శీర్షాసనం వేయడంతో పాటు ఇతర కఠినమైన వర్కౌట్లు చేస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. స్టే హార్డ్ అనే క్యాప్షన్‌తో ఆయన ఈ వీడియోను పోస్ట్ చేశారు. అంతరిక్షంలో వ్యాయామం చేయడానికి ఏకాగ్రత, సంకల్పం, పట్టుదల ఎంతో అవ సరమని అనిల్ మీనన్ పేర్కొన్నారు.

## ఆసియా పర్యటనలో కిమ్‌తో ట్రంప్ మళ్లీ భేటీ..



**వాషింగ్టన్, అక్టోబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ మరోసారి సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చేనెలలో ఆసియా పర్యటనకు వెళ్లనున్న ట్రంప్.. కిమ్‌తో భేటీ అయ్యే అంశాన్ని తోసిపుచ్చలేదు. వచ్చే నెల 16న ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ పాల్గొననున్నారు. అనంతరం చైనాలోని షెన్‌జెన్‌లో నవంబరు 17 నుంచి 19 వరకు జరిగే ఏపీఈసీ సదస్సుకుహాజరవుతారు. ఈ పర్యటనలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోనూ ట్రంప్ సమావేశం కానున్నారు. ఈ ఏడాదిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది మూడోసారి కానుంది.

14-10Pg7exHMNWJQE.qxd:14-10Pg7exHMNWJQE.qxd 1/1/02 8:22 AM Page 1



# తెలుగు రాష్ట్రాలకు శ్రీశైలం ప్రాజెక్టు గర్వకారణం

## - ఇంజినీరింగ్ పటిష్టత, విద్యుత్ ఉత్పత్తి, బహుముఖ ప్రయోజనాలకు గుర్తింపు

### - ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు గర్వకారణమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. డ్యామ్ నిర్మాణ పటిష్ఠత, జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థం, సాగు, తాగు నీటి అవసరాలకు అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయం దశాబ్దాలుగా భారీ వరదలను తట్టుకుంటూ ప్రజలకు సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మంది మంచినీటి అవసరాలతో పాటు లక్షల ఎకరాల సాగునీటి అవసరాలను తీరుస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు అని వివరించారు. కృష్ణా జలాల వినియోగంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో విశేషమైన ప్రాధాన్యం కలిగి ఉందన్నారు.

**పట్టిసీమతో రాయలసీమకు ప్రయోజనం:** ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పట్టి సీమ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని గొట్టిపాటి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇప్పటివరకు సుమారు 500 టిఎంసిల నీటిని అందించడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. కృష్ణా డెల్టా రైతులకు అవసరమైన నీటిని అందిస్తూనే రాయలసీమ ప్రాంత అవసరాలకూ శ్రీశైలం జలాశయం అండగా నిలుస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించడం, ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా నీటిని సద్వినియోగం చేయడంలో ముఖ్యమంత్రి ముందుచూపు స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# తిరుపతిలో దళిత దేవాలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలు

### - కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్




**తిరుపతి(హెల్త్), అక్టోబరు 13, ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం అక్టోబరు 13వ తేదీ దళితుల హక్కుల దినోత్సవంగా జరుపుకుంటామని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలిపారు. మంగళవారం తిరుపతిలో దళిత ఆలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైంది. స్థానిక మాలవాడి గుండంలో పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూల దండ వేసి, నివాళి అర్పించి దళిత దేవాలయ ప్రవేశ శతాబ్ది ఉత్సవాలు లాంచనంగా ప్రారంభించారు. జాతీయ జెండాలతో ప్రదర్శనగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూల మాల వేసి నివాళి అర్పించారు. తిరుచానూరుకు చేరుకుని 33 మంది దళితులతో కలిసి పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. అక్టోబర్ 13వ తేదీని దళితుల హక్కుల దినోత్సవంగా ప్రకటించారు. భారతదేశ చరిత్రలో 1925, అక్టోబర్ 13వ తేదీ చారిత్రాత్మక రోజు అని పేర్కొన్నారు. వందేళ్ళ క్రితం మురుగన్ అనే ఒక పంచముడు తిరుచానూరు ఆలయ ప్రవేశం చేసి, కర్పూర హారతి ఇచ్చాడని గుర్తు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తిరుపతి జైల్లో పెట్టారన్నారు. సి. రాజగోపాలాచారి కేసు వాదించి శిక్ష పడకుండా చేశారన్నారు. మహాత్మా గాంధీ తిరుపతికి వచ్చి దీక్ష చేసి 33 మంది దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించారన్నారు. దళిత జాతి చరిత్రలో మురుగన్ నిలబడ్డాడని తెలిపారు. ఏడాది పాటు దేశవ్యాప్తంగా ఈ ఉత్సవాలు కొనసాగుతుందని చింతామోహన్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో చింతా నీనా, రవి, గాడి వెంకటయ్య, చందనమూడి శివ, తేజోవతి, ముని శోభ, దాసరి చిరంజీవి,

పరదేశి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడారు ఎంపీ కురుమూర్తి .

## విద్యుత్ బిల్లుల పేరుతో మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - బ్యాంకు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు

**ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, అక్టోబరు 13 ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ బిల్లుల చెల్లింపులు, విద్యుత్ సరఫరా నిలిపివేత పేరుతో సైబర్ మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం పేర్కొన్నారు. విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వెంటనే బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలియజేస్తూ, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యుత్ బిల్లుల పేరుతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఎటిఎం కార్డు వివరాలు, ఓటిపి, యుపిఐ పిన్‌ను అడిగే వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియజేయవద్దన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఎస్పీడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్, అధికారిక మొబైల్ యాప్ ద్వారా చెల్లించాలని సూచించారు. బిల్లు బకాయిలు లేదా విద్యుత్ సరఫరా నిలిపివేతపై సందేహాలు ఉంటే, గుర్తుతెలియని వ్యక్తులను సంప్రదించకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలన్నారు. విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సందేశాలకు స్పందించవద్దని, మోసపూరిత కార్యకలాపాలపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు.

## నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం

### - ఆటోను ఢీకొన్న కారు 9 మందికి గాయాలు

**మర్రిపాడు (నెల్లూరు), అక్టోబర్ 13, ప్రభాతవార్త :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 9మందికి గాయాలైనాయి. సమాచారం అందుకున్న మర్రిపాడు ఎస్ఐ బలరాంరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలమేరకు మర్రిపాడు మండలంలోని డిసిపల్లి గ్రామానికి చెందిన 10మంది కూలీలు చుంచులూరులో జామాయిల్ చెట్లు నాటి పని ముగించుకొని నందవరం గ్రామానికి చెందిన ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా గంగుంటవద్ద రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. జొన్నవాడ ఆలయం నుండి కర్నూలుకు వెళుతున్న కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వలనఆటోను ఢీకొట్టా డని, ప్రమాదానికి కారణమైంది.

## స్థానిక సంస్థల్లో బిసిలకు 40శాతానికి పైగా ప్రాతినిధ్యం : మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** గత వైసిపి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లకు కోత విధించి వారిని రాజకీయంగా అణచివేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 40శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పిస్తూ వారికి భరోసా ఇస్తోందని రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ కల్పించేలా త్వరలోనే బిసి రక్షణ చట్టం తీసుకురానున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో బిసిలకు రాజకీయంగా, సామాజికంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. నాడు ఎన్టీ రామారావు.. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బిసిలకు 20శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని వివరించారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం, బిసిలు టిడిపికి అండగా ఉన్నారనే అక్కసుతోనే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. కావాలనే తమ అనుయాయులతో కోర్టుల్లో కేసులు వేయించి, సరైన వాదనలు వినిపించకుండా బిసిలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 16,800 మంది బిసిలు చట్టబద్ధంగా దక్కాల్సిన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో బిసి రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించారని, దీని కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. న్యాయస్థానాల పరిమితులకు లోబడి రిజర్వేషన్లు ఖరారు చేసినప్పటికీ, పార్టీల పరంగా బీసీలకు అత్యధిక సంఖ్యలో టికెట్లు కేటాయించడం ద్వారా మొత్తం ప్రాతినిధ్యం 40 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బిసి అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి వారి హత్యలకు కారణమై బిసి నాయకత్వాన్ని అణచివేయాలని వైసిపి ప్రయత్నించిందని మంత్రి ధ్వజమెత్తారు. ఇటువంటి దాడుల నుంచి బిసి నేతలను సంరక్షించేందుకు నారా లోకేశ్ ఆధ్వర్యంలో బిసి రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే దానికి చట్టబద్ధత కల్పిస్తామని స్పష్టం చేశారు.

## ఎపి మహిళా కమిషన్ సభ్యురాలిగా స్వాతిరెడ్డి

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి మహిళా కమిషన్ సభ్యురాలిగా స్వాతిరెడ్డి (గౌతమి శ్వేత కోట) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా జిఒ జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో వైసిపి సోషల్ మీడియా ద్వారా ఎదురైన వేలాది ట్రోల్స్, వేధింపులను ధైర్యంగా తట్టుకుని, టిడిపి తరపున బలంగా పోరాడిన ఆమె సేవలకు గుర్తింపుగా కూటమి ప్రభుత్వం ఈ బాధ్యతలను అప్పగించింది.

## విభిన్న ప్రతిభావంతులు ఆత్మగౌరవంతో జీవించాలి

### - కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ

**పాలకొల్లు, అక్టోబరు 13 ప్రభాతవార్త:** విభిన్న ప్రతిభావంతులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను అందిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. మంగళవారం పాలకొల్లు మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో 365 మంది లబ్ధిదారులకు రూ.1.10 కోట్ల విలువైన 530 సహాయ ఉపకరణాలను ఆయన, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి పంపిణీ చేశారు. ఏఐఎల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా ఈ ఉపకరణాలను అందించారు. బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ వీల్‌చైర్లు, డిజిటల్ వినికిడి యంత్రాలు, సాధారణ వీల్‌చైర్లు, చేతితో నడిపే ట్రైసైకిళ్లు, నడకకు సహాయపడే పరికరాలు తదితరాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి అవసరాలకు అనుగుణంగా సహాయ ఉపకరణాలు అందించడం ప్రభుత్వాల బాధ్యతని పేర్కొన్నారు. ఈ పరికరాల ద్వారా రోజువారీ పనులు సులభతరం కావడంతోపాటు, కుటుంబ సభ్యులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత రూ.50 లక్షలతో ప్రారంభించిన సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ప్రస్తుతం రూ.1.10 కోట్లకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు, అవసరమైన సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షి   ంచారు. అంతకుముందు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు కలిసి లబ్ధిదారులకు అందజేసిన ఉపకరణాలను పరిశీలించారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు 'స్త్రీనిధి' భారీ ఊతం

## - 11శాతం వడ్డీకే రూ.3 లక్షల స్త్రీనిధి రుణాలు

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా 'స్త్రీనిధి' ఆంధ్రప్రదేశ్ ద్వారా ప్రత్యేక మహిళా పారిశ్రామికవేత్తల రుణ పథకాన్ని ప్రారంభించినట్లు కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘం మహిళకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని.. ఒక్కో స్వయం సహాయక సంఘం నుంచి గరిష్టంగా ముగ్గురి చొప్పున అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 48 గంటల్లోనే రుణం మంజూరు అవుతుందని, వడ్డీ యేడాదికి 11 శాతం మాత్రమే అని మంత్రి తెలిపారు. డిజిటల్, బయోమెట్రిక్ ప్రక్రియతో పాటు 2024-25 నుంచి 8 అక్టోబరు 2026 వరకు సుమారు 17.96 లక్షల మంది మహిళలకు రూ.14,467.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రూ.4,443.13 కోట్లు వసూలు కాగా.. గ్రామ సంస్థల కోసం రూ.6 కోట్ల విలువైన 30,000 బయోమెట్రిక్ పరికరాల పంపిణీ చేశామన్నారు. 98శాతంతో ఆదర్శవంతమైన రికవరీ రేటు కూడా నమోదైందని మంత్రి స్పష్టం చేశారు. రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.17 లక్షలకు, గ్రామ సంస్థల పరిమితిని రూ.1.50 కోట్లకు పెంచామన్నారు. పిల్లల చదువులు, వివాహాలకు 4శాతం వడ్డీ రాయితీతో విద్య, వివాహ రుణాలు మంజూరు చేయడంతో పాటు పిఎంఎఫ్ఇ పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సబ్సిడీ రుణాలు, గిరిజన ప్రాంతాల మహిళలకు ప్రత్యేక స్వల్పకాలిక రుణాలు అందిస్తామన్నారు. 2026-27 సంవత్సరపు ఆర్థిక లక్ష్యంలో ఏకంగా రూ.3,000 కోట్లను కేవలం మహిళా పారిశ్రామికవేత్తల రుణాల కోసమే కేటాయించినట్టు మంత్రి పేర్కొన్నారు. రుణగ్రహీత మరణిస్తే కుటుంబానికి ఆసరాగా లోన్ ప్రొటెక్షన్, ప్రమాదవశాత్తు మరణ సహాయ పథకం వర్తిస్తుందన్నారు. మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, డిజిటల్ ఆర్థిక భాగస్వామ్యానికి స్త్రీనిధిని ఒక ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## ఎపికి వర్ష సూచన.. రానున్న మూడు రోజులు వానలు

**విజయవాడ, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎపిఎస్‌డిఎంఎ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఎపిఎస్‌డిఎంఎ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, బుధవారం (అక్టోబరు 14) పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున వర్షం సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల కింద నిలబడవద్దని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే రైతులు, కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## సత్యసాయి జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి ఢీ!

**టిడిపి, వైసిపి వ్యూహాత్మకంగా అడుగులు టిడిపి అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్?**

**వైసిపి అభ్యర్థిగా కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి లేదా వజ్ర భాస్కర్ రెడ్డి ?**

### జనరల్ సీటుగా కేటాయించడంతో అక్కడ ఎన్నికలు రసవత్తరం


కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి,


పరిటాల శ్రీరామ్,


వజ్ర భాస్కర్ రెడ్డి

**అనంతపురం, అక్టోబర్ 13, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్య సాయి జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానం జనరల్ సీటుగా కేటాయించడంతో ప్రస్తుతం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. తెలుగుదేశం పార్టీ బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు సన్నాహాలు చేస్తుండడంతో ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా బలమైన అభ్యర్థుల్ని రంగంలోకి దింపేందుకు సిద్ధం చేస్తోంది. రెండు పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాల్లో ఉన్నాయి. ప్రస్తుతం జరగబోయే జిల్లా పరిషత్ ఎన్నికల్లో శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానానికి టిడిపి తరఫున ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ను బరిలోకి దింపే అవకాశం కనిపిస్తోంది. టిడిపి వర్గాల్లో శ్రీరామ్ పేరు బలంగా వినిపిస్తోంది. దివంగత నేత, మాజీ మంత్రి పరిటాల రవి తనయునిగా , టిడిపి యువ నాయకునిగా పరిటాల శ్రీరామ్ కు గుర్తింపు ఉంది. 1999 శాసనసభ ఎన్నికల్లో రాప్తాడు శాసనసభ స్థానం నుంచి పరిటాల శ్రీరామ్ టిడిపి తరఫున పోటీ చేసి పోటీ చేసి వైసిపి అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2024 శాసనసభ ఎన్నికల్లో రాప్తాడు స్థానం నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత ( టీడీపీ) తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి (వైసీపీ) విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ ధర్మవరం స్థానం నుంచి పోటీ చేయాలని గట్టి ప్రయత్నించారు. పరిటాల శ్రీరామ్ టిడిపి తరఫున, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ( వరదాపురం సూరి) బిజెపి తరఫున ధర్మవరం స్థానం నుంచి పోటీ చేసేందుకు టికెట్ తెచ్చుకోవాలని ఎవరికివారు సర్వశక్తులా వడ్డారు. అయితే టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి గత శాసనసభ ఎన్నికల్లో బరిలో దిగడం ఎవ్వరు ఊహించని విధంగా ప్రస్తుతం మంత్రి సత్య కుమార్ యాదవ్ ( బిజెపి) తరఫున బరిగా దిగి విజయం సాధించారు. ఆ ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ రాజకీయాల్లో స్తబ్దతగా ఉండిపోగా పరిటాల శ్రీరామ్ మాత్రం ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతూ వస్తున్నారు. గత ఎన్నికల్లో శాసనసభ టికెట్ ఇవ్వలేకపోయామని కారణం, శ్రీ సత్య సాయి జిల్లాలో పలు నియోజకవర్గ నాయకులతో పరిటాల కుటుంబానికి మంచి సంబంధాలు ఉండడం, ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ అధ్యక్ష పదవి జనరల్ సీటుకు రిజర్వ్ కావడం, ఆర్థికంగా బలంగా ఉండడం తదితర కారణాల వల్ల టిడిపి అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ పేరును టిడిపి అధిష్టాన వర్గం బలంగా పరిశీలిస్తుంది.

## మొబైల్ చోరీ అనుమానంతో వ్యక్తి దారుణ హత్య

**నెల్లూరు క్రైం, అక్టోబర్ 13, ప్రభాతవార్త** మొబైల్ ఫోన్ చోరీ చేశారన్న అనుమానంతో నలుగురు వ్యక్తులు ఒక వ్యక్తిని విచక్షణారహితంగా కొట్టి చంపిన అమానుష ఘటన నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు నగరంలోని బాలాజీ నగర్, పద్మావతి నగర్ పుట్ట వీధికి చెందిన తాడి విజయ్ కుమార్ (40) లారీ డ్రైవర్‌గా జీవనోపాధి సాగిస్తూ గతంలో జరిగిన ఒక ప్రమాదం కారణంగా కొంతకాలంగా అనారోగ్యంతో, మానసిక పరిస్థితి సరిగా లేక తన పెద్ద తమ్ముడు శ్రీనివాసులు ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఎస్.వి.జి.ఎస్. కాలేజ్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుకుంటున్న సమయంలో ఒక మైనర్ బాలుడి మొబైల్ ఫోన్‌ను విజయ్ కుమార్ దొంగిలించాడనే అనుమానం తలెత్తింది.

ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం మణికంట, మధు, సన్నీ, సదరు మైనర్ బాలుడు కలిసి విజయ్ కుమార్‌ను ఎస్.వి.జి.ఎస్. కాలేజ్ దగ్గరకు ఫోన్ ఆచూకీ కోసం తీసుకెళ్లారు. అక్కడ నిందితులు ఫోన్ ఎక్కడ దాచావంటూ విజయ్ కుమార్‌ను కర్రలతో తీవ్రంగా కొట్టడంతో, ఆయన అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడి సోదరి పొదలకూరు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన బాలాజీ నగర్ పోలీసులు వెంటనే నిందితులపై కేసు నమోదు చేశారు.



## జలపాతం వద్ద స్నానానికి దిగిన విద్యార్థి మృతి

**రాజవొమ్మంగి, అక్టోబరు 13 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివాలయం సమీపంలో జలపాతాలు వద్ద గడుఒకుర్తి పంచాయితీ దోనేల పాలెం గ్రామానికి చెందిన తొమ్మిది మంది గిరిజన విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం స్నానాలకు దిగారు. ఐదుగురు ఒడ్డుకు వచ్చారు. ఇంకా నలుగురు స్నానాలు చేస్తుండగా వారిలో కేదారి దిలీప్. కుమార్ మునిగిపోయాడు. రాత్రి ఏడు గంటలు వరకూ సి.ఐ. సన్యాసి నాయుడు, ఎస్.ఐ. చినబాబు, పోలీసు సిబ్బంది, ఫైర్ సిబ్బంది, దోనేలపాలెం గ్రామస్తులు జలపాతం వద్ద గాలించారు. రాత్రి కావడంతో విరమించారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు అదే ప్రాంతంలో దోనేలపాలెం గ్రామస్తులు గాలించగా మృతదేహం లభ్యమైంది. విద్యార్థి తండ్రి సింహాచలం పిర్యాదుపై జడ్డంగి ఎస్.ఐ. చినబాబు కేసు నమోదు చేశారు. విద్యార్థి మృతదేహాన్ని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం చేసిన పిదప కుటుంబీకులకు అప్పగించారు.

## కారీరిష్టి వరుణ యాగం జరిపించినా కరుణించని వరుణుడు!

### - తిరుమల జలాశయాల్లో అడుగంటుతున్న నీటి నిల్వలు

**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ప్రధాన తాగునీటి జలాశయాల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోతోంది. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రరూపం దాల్చడంతో సకాలంలో కురవని వర్షాలు... సహకరించని అల్పపీడనాలు వెరసి తిరుమలలో తాగునీటి సమస్య ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే తిరుమలలో ప్రధానంగా పసుపుధార, కుమారధార ప్రాజెక్టు జలాశయాల్లో నీరు అడుగంటింది. ఇక ఉన్న గోగర్భమ్‌డ్యామ్, పాపవినాశనమ్ జలాశయాల్లో నీరు వినియోగం కూడా పెరిగింది. తిరుమలకు సాధారణరోజుల్లోనే ఒకలక్షమంది వరకు భక్తులు వస్తుండగా వారాంతం ,ప్రత్యేక పర్వదినాల్లో 1.30లక్షలమందివరకు చేరుతుంది. ప్రస్తుతం తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతుండటంతో భక్తుల రద్దీకి తగ్గట్లు నీటి వినియోగం కూడా పెరిగింది. రోజువారీగా 60లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో గోగర్భమ్‌డ్యామ్ నుండి 15లక్షల గ్యాలన్లు, పాపవినాశనమ్ నుండి 15లక్షలు గ్యాలన్లతోబాటు చంద్రగిరి సమీపంలోని కల్యాణిడ్యామ్ నుండి 30లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ఇప్పటికే తిరుమలలో నీటిని పొదుపుగా వాడాలని టిటిడి ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో తిరుమలలోని జలాశయాల్లో నిల్వవున్న నీరు 90రోజులకు అటూఇటూ వినియోగించుకునే వీలుంది. అప్పటికీ వానలు కురవకపోతే పరిస్థితి ఏంటనేది టిటిడి అధికారులు తలలుపట్టుకోవాల్సి వస్తోంది. ఆగస్టులో ఐదురోజులు మంచి వర్షాల కోసం తిరుమలలో టిటిడి కారీరిష్టి వర్జన్య వరుణయాగం, వరుణహోమం కూడా జరిపించింది. అయినా వరుణదేవుడు కరుణించలేదు. ఇప్పటికే గతనెలలో అడ పాదడపా వాన కురుస్తున్నా ఆశించిన స్థాయిలో జలాశయాలకు నీరు చేరలేదు. వర్షాభావ పరిస్థితితో తిరుమలలో నీటి సమస్య ఎదురుకానుంది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో 14,304లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యంకాగా ప్రస్తుతం 4లక్షల గ్యాలన్ల కంటే తక్కువ నీరు వరకు మాత్రమే అందుబాటులో ఉందనేది సమాచారం. ఈ నీరు కేవలం 80 రోజులుమాత్రమే అవసరాలకు సరిపోతుంది. టిటిడి అధికారుల ముందు చూపులేని అవగాహన రాహిత్యంతో తిరుమలలో నీటికొరత సమస్య ఎదురవడం భక్తులకు కష్టాలు తప్పవనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికే నీటికొరతతో స్థానికులకు, భక్తులకోసం ఏర్పాటుచేసిన కొళాయిలు, పబ్లిక్ బాత్‌రూమ్‌లకు నీటి సరఫరాలో రేషన్ విధానం అమలుచేస్తున్నారు. వర్షాకాలంలో, బ్రహ్మోత్సవాలకు ముందు నీటిసమస్య తలెత్తుతుందనే ముందుగానే హెచ్చరించారు.

# పోషకాహార ఫలితాల సాధనలో వేగం పెంచాలి!

### సేవల నాణ్యత, శాఖల సమన్వయం, ఆధారబద్ధమైన కార్యాచరణకు ప్రాధాన్యం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




**విశాఖపట్నం, అక్టోబర్ 13 ప్రభాత వార్త :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, పిల్లల పోషకాహార స్థితిని మెరుగుపరిచి, ఆశించిన ఫలితాలను వేగంగా సాధించేందుకు సేవల నాణ్యతను పెంచడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో నోవాటెల్ లో మంగళవారం నిర్వహించిన "ఆంధ్రప్రదేశ్‌లో పోషకాహార ఫలితాలను వేగవంతం చేయడం" అనే రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభ సమావేశంలో మంత్రి ప్రసంగించారు. స్వర్ణాంధ్ర లక్ష్యం కేవలం ఆర్థిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాదని, ఆరోగ్యవంతమైన తల్లులు, చక్కగా ఎదిగే పిల్లలు, సాధికారత పొందిన మహిళలు, బలమైన భవిష్యత్ తరాన్ని నిర్మించడం కూడా అంతర్భాగమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సామర్థ్యాల అభివృద్ధికి పెట్టుబడి పెట్టడం ద్వారా సంక్షేమ కార్యక్రమాల నుంచి మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంలో రాష్ట్రం సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ, అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు సేవల నాణ్యతను పెంచి, ఇంకా సేవలు అందని మరియు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వాటిని చేరువ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో వలస కుటుంబాలు, పట్టణాల్లోని బలహీన వర్గాల అవసరాలకు అనుగుణంగా పట్టణ పోషకాహార సేవలను మరింత సరళంగా, సమర్థవంతంగా అందించే విధానాలను రూపొందించాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన తల్లి, బిడ్డకు అవసరమైన సేవలు అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కిశోర బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. రక్తహీనత నివారణ, ఆరోగ్యకరమైన ఆహారం, రుతుక్రమ ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, బాల్య వివాహాలు మరియు చిన్న వయసులో గర్భధారణ నివారణ, విద్య, భవిష్యత్ అవకాశాలపై సమగ్ర దృష్టి పెట్టాలని తెలిపారు. కిశోరి వికాసం, సఖి, యువ గ్రూపులు, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోషకాహార సేవల్లో కేవలం ఎంతమందికి సేవలు అందించామనే అంశానికే పరిమితం కాకుండా, ఆ సేవల ద్వారా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తోందనే దానిపై దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం మెరుగైన పర్యవేక్షణ, సిబ్బంది సామర్థ్యాభివృద్ధి, డేటా వినియోగం అవసరమని, అదే సమయంలో క్షేత్రస్థాయి సిబ్బందిపై అదనపు పత్రాల నిర్వహణ భారం పడకుండా చూడాలని సూచించారు. పోషకాహార ఫలితాల సాధనలో వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజ ఆధారిత సంస్థలు, అభివృద్ధి భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో భాగంగా మార్గదర్శి - ఆంధ్రప్రదేశ్ న్యూట్రిషన్ అడ్వైజరీ గ్రూప్ ఏర్పాటు ద్వారా నిపుణులు, పరిశోధకులు, అనుభవజ్ఞులైన భాగస్వాముల నుంచి ఆధారబద్ధమైన సాంకేతిక సలహాలు పొందుతూ, రాష్ట్ర పోషకాహార విధానాలు, కార్యక్రమాల అమలు, సేవల పంపిణీని మెరుగుపరచనున్నట్లు తెలిపారు.

14-10pg10.qxdo/p:14-10pg10.qxd 1/1/02 8:56 AM Page 1



ఆట



## మైయా ఓపెన్ ఎటిపి: సుమిత్ విజయంతో పునరాగమనం

**మైయా, పోర్చుగల్:** మైయా ఓపెన్ ఏటీపీ 100 టోర్నమెంట్‌లో పోర్చుగల్‌కు చెందిన హెన్రిక్ రోచాను ఓడించడానికి భారతదేశపు అగ్రశ్రేణి పురుషుల టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ అద్భుతమైన పునరాగమనం చేసాడు. ఒక గంట 21 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో, నాగల్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని రెండో సీడ్ రోచాను 3-6, 7-5, 7-6 (5) తేడాతో ఓడించి, రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ముఖ్యంగా ఉత్కంఠభరితమైన నిర్ణయాత్మక సెట్‌లో భారత ఆటగాడు పలుమార్లు ఓటమి అంచుకు చేరుకున్నాడు. రోచా రెండుసార్లు మ్యాచ్ కోసం సర్వ్ చేశాడు, మొదట 5-4 వద్ద, ఆపై 6-5 వద్ద నాగల్ బ్రేక్ చేసి పోటీలో నిలిచాడు. టైబ్రేక్‌కు దారితీసిన తర్వాత, నాగల్ మొదట 2-0 ఆధిక్యం సాధించి, ఆ తర్వాత 4-2తో ముందుకు దూసుకెళ్లాడు. రోచా పోరాడి 5-4తో ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ భారత ఆటగాడు తర్వాతి మూడు పాయింట్లు గెలుచుకుని అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. నాగల్ తదుపరి ప్రీక్వార్టర్ ఫైనల్‌లో పోర్చుగల్‌కు చెందిన టియాగో పెరీరా లేదా క్రొయేషియాకు చెందిన లుకా మిక్రుత్‌తో తలపడనున్నాడు. ఆసియా క్రీడల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన తర్వాత లుకా ఈ టోర్నమెంట్‌లో ప్రవేశించాడు, అక్కడ అతను చైనాకు చెందిన యిబింగ్ వు చేతిలో 4-6, 4-6 తేడాతో ఓడిపోయాడు.



## వాలీబాల్ ఛాంపియన్స్ లీగ్.. పంజాబ్ 2-1తో అయోధ్యపై గెలుపు

### తమిళ టైటాన్స్ సూపర్ 6కి అర్హత

**నోయిడా:** నోయిడాలో జరిగిన వాలీబాల్ ఛాంపియన్స్ లీగ్ (విసిఎల్) మ్యాచ్‌లో పంజాబ్ ఏరోస్ట్రైకర్స్ అద్భుతంగా పుంజుకుని అయోధ్య గర్జన్‌ను 2-1 తేడాతో ఓడించగా, తమిళ టైటాన్స్ హుగ్లీ హిట్టర్స్‌పై అదే స్థాయిలో విజయం సాధించి సూపర్ 6 లో తమ స్థానాన్ని సురక్షితం చేసుకుంది. హోరాహోరీగా సాగిన మొదటి సెట్‌లో అయోధ్య గర్జన్‌ను 21-18 తేడాతో ఓడించి, పంజాబ్ ఏరోస్ట్రైకర్స్ తమ మ్యాచ్‌ను సానుకూలంగా ప్రారంభించింది. రెండవ సెట్‌లో అయోధ్య బలంగా పుంజుకుని 21-16 తేడాతో కైవసం చేసుకుని, స్కోరును 1-1తో సమం చేసింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిన నిర్ణయాత్మక సెట్‌లో, పంజాబ్ ప్రత్యర్థులపై ఒత్తిడి కొనసాగిస్తూ పట్టు సాధించింది. ఏరోస్ట్రైకర్స్ మూడవ సెట్‌ను 21-11 తేడాతో కైవసం చేసుకుని, 2-1తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో, తమిళ టైటాన్స్ తొలి రెండు సెట్లు గెలిచి, హుగ్లీ హిట్టర్స్‌ను 2-1 తేడాతో ఓడించి సూపర్ 6కు అర్హత సాధించింది. తొలి సెట్‌ను 21-19 తేడాతో అతి కష్టం మీద గెలుచుకున్న టైటాన్స్, ఆ తర్వాత ఉత్కంఠభరితమైన రెండో సెట్ పోరాటంలో నెగ్గింది. స్కోరు 20-20తో సమంగా ఉన్నప్పుడు, వారు కీలకమైన పాయింట్‌ను గెలుచుకుని సెట్‌ను 21-20తో కైవసం చేసుకున్నారు, తద్వారా విజయానికి ఒక సెట్ దూరంలో నిలిచారు. మూడవ సెట్‌లో హుగ్లీ హిట్టర్స్ పుంజుకుని 21-10 తేడాతో విజయం నమోదు చేశారు. అయితే, అప్పటికే టైటాన్స్ మొదటి రెండు సెట్లను కైవసం చేసుకుని మ్యాచ్‌ను తమ వశం చేసుకుని సూపర్ 6లో తమ స్థానాన్ని ఖరారు చేసుకున్నారు.



## ఆస్ట్రేలియా గెలుపు

### 214 రన్స్ తేడాతో సౌతాఫ్రికా ఓటమి

**డర్బన్:** సౌతాఫ్రికాతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. డర్బన్ వేదికగా మంగళవారం జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన ఆస్ట్రేలియా 214 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. మ్యాట్ రెన్‌షా(190, 82,2/30) అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 421 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా 102/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 86.5 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. ఎయిడెన్ మార్క్‌రమ్(75) ఒంటరి పోరాటం చేయగా, డేవిడ్ బెడింగ్‌హామ్(46), మార్కో జాన్సెన్(35), వియాన్ మల్డర్(29) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్(6/49) 6 వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. మ్యాట్ రేన్‌షా(2/30) 2 వికెట్లు, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్ తలో వికెట్ తీసారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మ్యాట్ రేన్‌షా(190) అసాధారణ శతకంతో తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. సౌతాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్(4/68) 4 వికెట్లు, మార్కో జాన్సెన్(3/68), అన్రిచ్ నోర్జ్(2/88) 2 వికెట్లు, సిమన్ హార్మర్ ఒక వికెట్ తీసాడు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ బెడింగ్‌హామ్(49) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్ వుడ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు, ప్యాట్ కమిన్స్ 3 వికెట్లు, బ్యూ వెబ్‌స్టర్‌కు ఒక వికెట్ దక్కింది. 106 పరుగుల భారీ ఆధిక్యంతో ఆస్ట్రేలియా 58 ఓవర్లలో 6 వికెట్లకు 314 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. మ్యాట్ రేన్‌షా(82) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికా బౌలర్లలో అన్రిచ్ నోర్జ్, కేశవ్ మహరాజ్ రెండేసి వికెట్లు, మార్కో జాన్సెన్, సిమన్ హార్మర్ తలో వికెట్ పడగొట్టారు.

## సిరాజ్ సారథ్యంలోని హైదరాబాద్ గెలుపు

### 40 పరుగుల తేడాతో త్రిపుర చిత్తు



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో హైదరాబాద్ శుభారంభం చేసింది. జింఖానాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్, 40 పరుగుల తేడాతో విజయం సాధించి, హైదరాబాద్ తన రంజీ ట్రోఫీ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఎలైట్ గ్రూప్‌బీలో భాగంగా త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 40 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. హైదరాబాద్ బౌలర్లు అనికేత్(5/21), తనయ్ త్యాగరాజన్(3/37, 6/52) ఒక మోస్తరు స్కోరు చేయడంతో మూడు రోజుల్లోనే విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలోనే 134 పరుగులకు కుప్పకూలింది. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 103.2 ఓవర్లలో 294 పరుగుల భారీ స్కోర్ చేసింది. తన్మయ్ అగర్వాల్(122 బంతుల్లో 2 ఫోర్లతో 54), రుతిక్ మెండే(150 బంతుల్లో 5 ఫోర్లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా, రాహుల్ రాదేశ్(119 బంతుల్లో ఫోర్‌తో 40), చామ మిలింద్(55 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40) పర్వాలేదనిపించారు. 164 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన త్రిపుర 120 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. హైదరాబాద్ కెప్టెన్, టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.





## నేడే హైదరాబాద్‌లో టి20

### సిరీస్ కైవసానికి పట్టుదలతో భారత్

### సమం చేయాలని వెస్టిండీస్ వ్యూహం

**న్యూఢిల్లీ:** ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 21 ఆధిక్యంలో ఉన్న టీమిండియా నాలుగో టీ20 మ్యాచ్ కోసం హైదరాబాద్ చేరుకుంది. ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించిన శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ ఈ నెల 14న హైదరాబాద్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ పట్టుదలతో ఉండగా, వెస్టిండీస్ జట్టు సిరీస్‌ను సమం చేయాలని వ్యూహాత్మకంగా బరిలోకి దిగనుంది. హైదరాబాద్ పిచ్ పరిస్థితులకు అనుగుణంగా భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎటువంటి మార్పులు ఉండబోవనేది తెలుస్తోంది. భారత ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్ స్థానాలు దాదాపు ఖాయమయ్యాయి. హైదరాబాద్ స్టేడియంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో సంజు మూడో స్థానంలో ఉన్నాడు. ఒక సెంచరీ కూడా సాధించాడు. మూడో నంబర్‌లో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్‌కు రానున్నారు. జట్టు యాజమాన్యం గత మ్యాచ్‌ల్లో లాగే ఈ మ్యాచ్‌లోనూ ముగ్గురు ఆల్‌రౌండర్లను కొనసాగించే అవకాశం ఉంది. నమన్ ధీర్, నితీష్ కుమార్, అక్షర్ పటేల్ ఈ స్థానాల్లో రాణించనున్నారు. గత మ్యాచ్‌లో ఈ ముగ్గురు కలిసి బ్యాటింగ్‌లో 52 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో కీలకమైన నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక హైదరాబాద్ రాజీవ్ గాంధీ స్టేడియం పెద్దది కావడం వల్ల అదనపు పేసర్ కంటే స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించడం జట్టుకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను పక్కన పెట్టి, స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. దీంతో భారత్ ఓ స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్, ఆల్‌రౌండ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌తో పాటు పేసర్లుగా అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్‌లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. హైదరాబాద్ టీ20 కోసం భారత అంచనా తుది జట్టు చూస్తే సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ కుమార్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.

## బడ్జెట్ ప్రతిపాదనల్లోనే ఎల్‌టిసిజిపై అభిప్రాయసేకరణ

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** దీర్ఘకాలిక మూలధన లబ్ధి అంటే ఎల్‌టిసిజిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. బడ్జెట్ సంప్రదింపుల సమయంలో దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను తొలగింపుపై అభిప్రాయాలను వినడానికి ప్రభుత్వం ఆసక్తితో ఉందని పేర్కొన్నారు. ఆమె ఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడారు. ఈ చర్చలో సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను ఎస్టీటీ, వివిధ ఆస్తి తరగతులను ఒకే విధంగా పరిగణించాలా వద్దా అనే విషయం కూడా ఉందని సీతారామన్ అన్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్ సన్నాహాలు ప్రారంభమైనందున, దీనిపై వ్యాఖ్యానించడానికి ఇది చాలా తొందర పాటు అవుతుందన్నారు. భారతదేశం, విదేశాలలో ఉన్న పెట్టుబడిదారులు మూలధన లాభాలు, వివిధ ఆస్తి వర్గాలపై పన్నుల గురించి చర్చిస్తున్నారని, వారి అభిప్రాయాలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీతారామన్ అన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించడానికి, విదేశీ మూలధన ప్రవాహాలను స్థిరీకరించడంలో సహాయ పడటానికి ఈక్విటీపెట్టుబడులపై ఎల్టీసీజీ పన్నును రద్దు చేయాలని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక ప్రతిపాదించిన ఒక రోజుతర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల ఎల్‌టిసిజి పన్నును రద్దు చేస్తూ, ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించే కాలాన్ని రెండు లేదా మూడు సంవత్సరాలకు పొడిగించడాన్ని పరిశీలించాలని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. పెట్టుబడులను కొనసాగించే కాలాన్ని 23 సంవత్సరాలకు పొడిగించి ఈక్విటీపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును రద్దు చేయడం ద్వారా ఈక్విటీ రంగంలోకి వస్తున్న హాట్ మనీప్రవాహాలను అరికట్టేఅంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాలని నివేదికలో పేర్కొంది. భారతీయ ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరంతరంగా అమ్మకాలు జరుపుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. అక్టోబర్‌లో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 44,166 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దీంతో 2026 నాటికి వారి మొత్తం ఈక్విటీ పెట్టుబడుల విత్‌డ్రాలు రూ. 3.04 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ పెట్టుబడులపై విదేశీ ఇన్వెస్టర్లకు ప్రస్తుతం ఎల్టీసీజీ పన్ను రేటు 12.5 శాతంగా ఉంది. కేంద్ర బడ్జెట్ 2026, 2024లో ప్రవేశపెట్టిన విధానాన్ని కొనసాగిస్తూ, లిస్టెడ్‌షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లకు ఈరేటును యథాతథంగా ఉంచింది. ఎగుమతి ఆదాయాల స్వదేశీకరణను సరళీకృతం చేయాలని, దాదాపు ఆరు నెలల సహేతుకమైన కాలపరిమితిని విధించాలని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. కాగా రూపాయి అస్థిరతను అరికట్టడంపై ఆర్‌బిఐ దృష్టి సారించిందని సీతారామన్ అన్నారు.

## డాలర్‌తో పటిష్టం అవుతున్న భారత్ రూపాయి



**ముంబయి, అక్టోబరు 13:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుసగా రెండో రోజూ భారీగా బలపడింది. మంగళవారం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏకంగా 77 పైసలు లాభపడి 95.05 వద్ద ట్రేడ్ అయింది. డాలర్ డిమాండ్‌ను తగ్గించడం, స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టడం లక్ష్యంగా ఆర్బీఐ తీసుకున్న కఠిన చర్యలు రూపాయికి అండగా నిలిచాయి.ముందురోజు కూడా రూపాయి 93 పైసలు లాభపడి 95.78 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఆరునెలల్లో ఒక్కరోజులో ఇంతటి వృద్ధిని నమోదు చేయడం ఇదే తొలి సారి. ఆర్బీఐ తాజాగా తీసుకున్న చర్యల్లో భాగంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల కోసం ప్రత్యేక డాలర్ విండోను ఏర్పాటు చేసింది. దీంతో స్పాట్ మార్కెట్లో డాలర్లకు డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నారు. ఇటీవల రద్దు చేసిన ఫారెక్స్ డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది. మరోవైపు అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.15 తగ్గి 102.43 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా తగ్గడం రూపాయికి సానుకూలంగా మారింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 1 పైగా తగ్గి 105.47 డాలర్ల వద్ద ఉంది. 2026 చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.60 నుంచి 97.50 మధ్య కదలాడవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## భారీ లాభాల దిశగా సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 13:** స్టాక్ మార్కెట్ నష్టాలకు బిగ్ బ్రేక్‌పడింది. మంగళవారం సెషన్‌లో సూచీలు రికార్డు స్థాయిలో పుంజుకున్నాయి. గత సెషన్లో భారీ లాభాల నుంచి నష్టాల్లోకి వెళ్లిన సూచీలు ఇవాళ ఒక్కసారిగా పుంజుకోవడంతో ఇన్వెస్టర్లలో సరికొత్త ఉత్సాహం వచ్చింది. బిఎస్ఇ సెన్సెక్స్ 1109 పాయింట్లు పెరిగి 73,034 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 359 పాయింట్లు ఎగబాకి 227.22 వద్ద సెషన్ ముగించింది. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్‌విలువ రూ. 5లక్షల కోట్ల వరకు పెరిగి రూ. 470 లక్షల కోట్లకు చేరుకుంది. గత కొంత కాలంగా అమ్మకాల ఒత్తిడితో అనిశ్చితిలో కూరుకుపోయిన ఐటీ స్టాక్స్ రాణించడం కలిసొచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎల్టీసీజీ పై కామెంట్స్ చేయడం కూడా కొనుగోళ్లకు మద్దతు ఇచ్చింది. స్టాక్ మార్కెట్ రాణించగా బిఎస్ఇ 30 ప్యాక్ ఇండెక్స్‌లో చూస్తే టాప్ గెయినర్స్ అన్నీ ఐటీ స్టాక్స్ ఉండటం విశేషం. అత్యధికంగా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 8.28 శాతం పెరిగి రూ. 1321 వద్ద స్థిరపడింది. టిసిఎస్ 6.59 దూసుకెళ్లి రూ. 2267 వద్ద ముగిసింది. టెక్ మహీంద్రా స్టాక్ 4.90 శాతం పెరిగి రూ. 1542 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ కూడా 4.44 శాతం పెరిగి రూ. 1062.20 వద్ద స్థిరపడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, మారుతీ సుజుకీ స్వల్పంగా నష్టపోగా 30 ప్యాక్ ఇండెక్‌లో మిగతావన్నీ లాభాలు నమోదు చేశాయి.మార్కెట్‌కు మద్దతు ఇచ్చిన ప్రధాన అంశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యల గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. ఎల్‌టిసిజి అంటే దీర్ఘకాలిక మూలధనలబ్ధిపై పన్ను. ఎస్టీటీ అనేది షేర్ల లావాదేవీలపై విధించే సెక్యూరిటీస్ అండ్ ట్రాన్సాక్షన్ టాక్స్. ఇందులో ప్రధానంగా విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకుంటుండటంతో ఈక్విటీలపై ఎల్‌టీసీజీ టాక్స్ రద్దు చేయాలని ఎస్బీఐ రీసెర్చ్ ఒక రిపోర్టులో పేర్కొంది. దీనికి తగ్గట్లుగా ఇవాళ నిర్మలమ్మ టాక్స్ రేట్లను సవరించడం లేదా రద్దు చేయడానికి సంబంధించి దేశీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి దీనిపై వస్తున్న అభిప్రాయాల్ని వినడానికి ప్రభుత్వం సిద్ధంగానే ఉందని ఆమె వ్యాఖ్యానించడం సానుకూల పరిణామంగా నిలిచింది. పన్నులపై చర్చలు జరుగుతున్నాయన్న సంకేతాలే మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతిచ్చాయి. దేశీయ ఐటీ సంస్థలు క్యూ2 ఫలితాల్ని ప్రకటిస్తున్నాయి. తొలుత టిసిఎస్ ఫలితాల్లో లాభం, ఆదాయం పెరిగాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఫలితాలు ప్రకటించగా ఇది మరింత ఎక్కువగా లాభాలు నమోదు చేసింది. ఇవాళ మార్కెట్లో ఐటీ స్టాక్స్ ర్యాలీకి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ బలమైన ఫలితాలు దోహదపడ్డాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 5 శాతానికిపైగా పెరగడం విశేషం. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 8 శాతానికిపైగా పెరగ్గా, టిసిఎస్ 7 శాతానికిపైగా దూసుకెళ్లింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 5 శాతం వరకు పెరిగాయి.

అమెరికన్ డాలరుతో పోలిస్తే రూపాయి విలువ వరుస సెషన్లలో భారీగా పుంజుకోవడం కలిసొచ్చింది. మంగళవారం ఉదయం 82 పైసలు లాభపడి డాలరుతో పోలిస్తే రూ. 94.96 స్థాయికి చేరింది. కిందటి రోజు ఆరంభంలో నేరుగా 97 పైసలు పెరిగిన సంగతి తెలిసిందే. మంగళవారం రోజు బాండ్ ఈల్డ్స్ రాబడి తగ్గగా, స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి.

ఇదే సమయంలో ఇంటర్నేషనల్ మార్కెట్లో మంగళవారం సెషన్‌లో క్రూడాయిల్ ధరలు పడిపోవడం కూడా స్టాక్ మార్కెట్ ర్యాలీకి మరో కారణంగా ఉంది. అక్టోబర్ 13 బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు ఒక శాతానికిపైగా తగ్గి 105 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా కూడా రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం సెషన్‌లో భారీ ర్యాలీ కనిపించినా మార్కెట్లో అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదని నిపుణులు చెబుతున్నారు. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన వీకే విజయ్ కుమార్ విదేశీ పెట్టుబడిదారులు ఇంకా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు కొనుగోళ్లు జరుపుతున్నారు. ఆర్బీఐ చర్యలతో రూపాయికి కాస్త మద్దతు లభించినా, అమెరికా బాండ్ ఈల్డ్స్ అధికంగానే ఉంటే విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు మున్ముందు కూడా కొనసాగవచ్చని అభిప్రాయపడ్డారు.

## ఒక్క వారంలోనే మనీవ్యూ అదిరిపోయే రిటర్నులు




**ముంబయి, అక్టోబరు 13:** స్టాక్ ఎక్స్ఛేంజిలో ఈ వారంలోనే లిస్ట్ అయిన మనీవ్యూ లిమిటెడ్ అంచనాలకు మించి లాభాలు అందించింది. ఇక్కడ ఐపిఒ కింద షేర్లు అలాట్ అయిన వారికి మంచి లాభాలు వచ్చాయని చెప్పొచ్చు. ఈనెల ఒకటిన ఎక్స్ఛేంజీల్లో లిస్టవగా అక్కడి నుంచి కూడా పెరుగుతూనే వెళ్లింది. మనీ వ్యూ ఐపిఒ ఇష్యూధర రూ. 32-34గా నిర్ణయించింది. ఇక్కడ ఒక్కో లాట్ కింద 441 షేర్లను కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ లెక్కన రూ. 34 ఇష్యూ ప్రైస్ దగ్గర పెట్టుబడి రూ. 14994గా ఉంది. ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 24 నుంచి 28 వరకు జరగ్గా, సెప్టెంబర్ 29న షేర్ల అలాట్‌మెంట్ జరిగింది. అక్టోబర్ 1న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయింది.ఇక్కడ ఐపిఒ ఇష్యూ ప్రైస్ రూ. 34 గా ఉండగా, నేరుగా ఎన్ఎస్ఇ లో 61.76 శాతం ప్రీమియంతో రూ. 55 వద్ద ఎంట్రీ ఇచ్చి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఇష్యూ ప్రైస్ నుంచి 93 శాతం వరకు పెరిగి రూ. 65.47 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. 12వతేదీ రూ. 62.12 వద్ద ముగిసింది. ఈ ధరతో చూసినట్లయితే ఐపిఒ ఇష్యూ ధర నుంచి ఏకంగా 83 శాతం రిటర్న్స్ అందించింది. సక్సెస్‌ఫుల్‌గా రూ. 14994 పెట్టుబడి పెట్టిన వారికి లాట్ వస్తే ఇప్పుడు వారి పోర్ట్‌ఫోలియో విలువ రూ. 27395గా ఉంది. అంటే ఒక్క లాట్‌పై రూ. 12400 వరకు ప్రాఫిట్ వచ్చింది. ఇక్కడ అక్టోబర్ 1న ఎక్స్ఛేంజీల్లో లిస్టవగా, అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మార్కెట్లకు సెలవు. అక్టోబరు 3, 4 శని, ఆదివారాలు పోగా అక్టోబరు 5, 6 తేదీల్లో స్టాక్ పతనమైంది. మళ్లీ అక్టోబరు 7న ఏకంగా 20 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. కేవలం వారంలోనే అదిరిపోయే రిటర్న్స్ ఇచ్చింది. ముందుగా మంచి సబ్‌స్క్రిప్షన్ లభించడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరచగా మంచి కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది.

## టివిఎస్ ఫ్యామిలీలో పెరిగిన ఆస్తుల చిచ్చు




**ముంబయి, అక్టోబరు 13:** భారత ఆటోమొబైల్ రంగంలో దిగ్గజ సంస్థల్లో ఒకటైన టివిఎస్ కుటుంబంలో ఆస్తుల పంపకాలపై విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ కుటుంబంలో ఆర్థిక ప్రయోజనాలు, కుటుంబ సంపద పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదని ఆయన భార్య మల్లిక శ్రీనివాసన్, కుమార్తె లక్ష్మీ వేణు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ వివాదం కంపెనీలో రోజువారీ నిర్వహణ బాధ్యతల కంటే కూడా కుటుంబ సంపదలో ఎవరికి ఎంత వాటా ఉండాలి, ఆస్తులను ఎలా పంచుకోవాలనే అంశాల చుట్టూనే తిరుగుతోంది. వేణు శ్రీనివాసన్ కుమార్తె అయిన లక్ష్మి వేణు టివిఎస్ కుటుంబానికి చెందిన పారిశ్రామిక వేత్త. ఆమె యేల్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ చదివారు. యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్మెంట్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ఆమె టాఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్) వైస్ ఛైర్మన్‌గా, టాఫే మోటార్స్ అండ్ ట్రాక్టర్స్ లిమిటెడ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా సుందరం క్లేటాన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆమె సోదరుడు సుదర్శన్ వేణు ప్రస్తుతం టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. టివిఎస్ గ్రూప్‌ను దశాబ్దాల కిందట టివి సుందరమ్ అయ్యంగార్ స్థాపించారు. తర్వాతి తరాల్లో కుటుంబ వ్యాపారాలు వేర్వేరు విభాగాలుగా విస్తరించాయి. 2020లో టివిఎస్ కుటుంబ వ్యాపారాల విభజన ప్రక్రియ కూడా జరిగింది. ఆ సమయంలో సంబంధిత కుటుంబ సభ్యులు, వాటాదారుల భాగస్వామ్యంతో ఆస్తుల విలువను నిర్ణయించి విభజించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా వేణు శ్రీనివాసన్ కుటుంబానికి టివిఎస్ మోటార్ కంపెనీ, టివిఎస్ హోల్డింగ్స్ వంటి కీలక సంస్థలపై నియంత్రణ లభించింది. అయితే వేణు శ్రీనివాసన్ కుటుంబంలోని ఆస్తుల విభజనపై అలాంటి పారదర్శకమైన, పరస్పర అంగీకారంతో ఎలాంటి ప్రక్రియ జరగలేదని మల్లిక లక్ష్మి వేణు చెబుతున్నారు. టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ అండ్ ఎండీగా ఉన్న సుదర్శన్ వేణు ట్రస్ట్ వ్యవస్థల ద్వారా కంపెనీలో ముఖ్యమైన ప్రయోజనం పొందనున్నట్లు టివిఎస్ హోల్డింగ్స్ వెల్లడించడంతో కుటుంబంలో విభేదాలు బయటపడ్డాయి. మరోవైపు లక్ష్మి వేణు, మల్లిక శ్రీనివాసన్ కుటుంబ సంపదకు సంబంధించి న్యాయమైన పరిష్కారం కోసం చర్చలు జరగాలని కోరుతున్నారు. కుటుంబ ఆస్తులపై హక్కులు, వాటాల విభజన కూడా కీలక అంశాలుగా ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.